


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 14-11-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 61 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## పర్యాటకుల ప్రాణాలతో

# చెలగాటమా?

- బోటు నిర్వాహకుల బాధ్యతా రాహిత్యమే
- యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు
- బోట్లను నియంత్రించేందుకు అథారిటీ కమిటీ
- మృతుల కుటుంబాలకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా
- శాసన సభలో ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటన

అమరావతిః కృష్ణానది పవిత్ర సంగమం వద్ద ఆదివారం (నవంబర్ 12) సాయంత్రం చోటు చేసుకున్న విషాదం తప్పకుండా బోటు నిర్వాహకుల బాధ్యతా రాహిత్యమేనని సీఎం చంద్రబాబు అన్నారు. బోటు ప్రయాణించిన తీరు చూస్తుంటే డ్రైవర్‌కు ఆ మార్గంపై కనీస అవగాహన లేనట్లు తెలుస్తోందని ఆయన చెప్పారు. ఇలాంటి ఘటన జరగడం చాలా బాధాకరం. పవిత్ర సంగమం సమీపంలో బోటు కుదుపులకు లోను కావడంతో డ్రైవర్ ఒక్కసారిగా పక్కకు తిప్పాడు.

దీంతో పర్యాటకులంతా ఓ వైపునకు చేరుకున్నారు. దీంతో భారం పెరిగి బోటు బోల్తా పడింది. ప్రమాద సమాచారం అందిన వెంటనే అధికారులు అక్కడికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. మంత్రులు చినరాజప్ప, కామినేని శ్రీనివాస్, అఖిలప్రియ హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు అని చంద్రబాబు అన్నారు.

బోటు నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు సీఎం చెప్పారు. ముగ్గురు బోటు సిబ్బంది ఆచూకీ తెలియడం లేదని ఆయన తెలిపారు. వాహనాలకు మాదిరిగానే బోట్లను కూడా నియంత్రించే విధంగా ఓ అథారిటీని ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పడవ ప్రమాదంపై శాసనసభలో ఆయన ప్రకటన చేశారు. ప్రమాదానికి గురైన బోటుకు ఎలాంటి తరువాయి 2లో



# ప్రకృతి ప్రకోపం..

- ఇరాన్ భూకంపంలో మృతుల సంఖ్య 328
- వందలాదిమంది క్షతగాత్రులు
- రిక్టర్ స్కేల్‌పై 7.3గా నమోదు
- పలు నగరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత
- భారత ప్రధాని మోదీ సంతాపం

బాగ్దాద్: ప్రకృతి ప్రకోపించింది. విధ్వంసం విలయ తాండవం చేసింది. ప్రకృతి బీభత్సానికి ఇరాన్ అతాల కుతలమైంది. ఇక్కడ ఆదివారం రాత్రి సంభవించిన భారీ భూకంపంలో మృతుల సంఖ్య 328కి పెరిగింది. మరో 2,500 మంది గాయపడ్డారు. ఇరాన్-ఇరాక్ సరిహద్దుల్లో తరువాయి 2లో



# 2021 తర్వాతే రిటైరవుతా...

హైదరాబాద్: తాను ఎమ్మెల్సీగా 2021 వరకు ఉంటానని, ఆ తర్వాత రిటైర్ కావాలనే ఆలోచన ఉందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. తాను జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులతో కడియం ముచ్చటించారు. ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ వల్ల దుష్ఫలితాలు కనిపించాయని, ఆధార్‌తో అనుసంధానం చేయడం వల్ల కాలేజీలు ఎక్కువగా.. విద్యార్థులు సంఖ్య తక్కువగా ఉండే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు.



కళాశాలల్లో బయోమెట్రిక్ తప్పనిసరి చేశామని, సరిపడా హాజరు ఉంటేనే పరీక్షలకు అనుమతి ఇస్తామని ఉప ముఖ్యమంత్రి తరువాయి 2లో

# అన్ని నేరాలనూ ఆపలేం



అల్వార్: రాజస్థాన్‌లో మరోసారి గో సంరక్షణదాడులు జరిగాయి. ఆవులను అక్రమంగా తరలిస్తున్నాడంటూ అల్వార్‌కి చెందిన ఉమ్మర్ ఖాన్ అనే వ్యక్తిపై కొందరు దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఉమ్మర్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై ఆ రాష్ట్ర హోంమంత్రి గులాబ్ చంద్ కటారియా స్పందించారు.

ఇలాంటి నేరాలన్నింటినీ ఆపడానికి రాష్ట్రంలో సరైన సిబ్బంది లేరని అన్నారు. పోలీసులు ఈ ఘటనపై తరువాయి 2లో

# ప్రభుత్వ వైఫల్యమే కారణం



అమరావతి: కృష్ణా నదిలో జరిగిన పడవ ప్రమాదం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఈ ప్రమాదంలో తన భార్య పుట్టింటికి చెందిన ముగ్గురు మహిళలు మృతి చెందారని తెలిపారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం పూర్తిగా నిర్వహణ లోపమేనని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని నారాయణ డిమాండ్ చేశారు.

# సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు తీరని అన్యాయం

- అందుకే పాటలు రాయాల్సి వచ్చింది
- రైతన్న మెరుగుకు సలహాలు, సూచనలు ఇవ్వండి
- తెలంగాణ సీఎం కేసీఆర్



హైదరాబాద్ః సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని సీఎం కేసీఆర్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాజెక్టులు, మైనర్ ఇరిగేషన్ తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆయన పునరుద్ఘాటించారు. శాసనసభలో సోమవారం (నవంబర్ 13) రైతులకు రూ. 8 వేల పెట్టుబడిపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు ఎంత అన్యాయం జరిగిందో తెలిపేందుకే వ్యవసాయం, ఇరిగేషన్ ప్రాజెక్టులపై పాటలు రాయాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

సమైక్య రాష్ట్రంలో తెలంగాణ వ్యవసాయ గతి ఏమైందో సభ్యులందరికీ తెలుసు. పల్లెల దుస్థితిపై కవులు పాటలు రాయాల్సి వచ్చింది. పల్లె పల్లెలో పల్లేర్లు మొలిచే.. లాంటి పాటలు ఉట్టిగ రాయలేదు. పాలమూరు రైతులు హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. కరీంనగర్‌లో 65 శాతం వ్యవసాయం బోర్లపైనే ఆధారపడి ఉంది అని కేసీఆర్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు పెట్టుబడి ఇస్తుంటే విమర్శించడం తగదని కేసీఆర్ అన్నారు. నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని సభ్యులకు ఆయన సూచించారు.

# వైష్ణోదేవి దర్శనానికి 50వేల మందికి మాత్రమే అనుమతి

దిల్లీ: జమ్ముకశ్మీర్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం వైష్ణోదేవి ఆలయ దర్శనంపై నిబంధనలు విధించింది జాతీయ హరిత ట్రైబ్యునల్. ఇకపై రోజుకు 50వేల మంది భక్తులను మాత్రమే వైష్ణోదేవి దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపింది. పరిమితికి మించిన భక్తులను అర్ధకువారీ లేదా కత్రా వద్ద ఆపివేస్తామని ఎన్‌జీటీ పేర్కొంది. రద్దీ ఎక్కువగా తరువాయి 2లో






## టేకిట్ ఈజీ




అమ్మాయా... అబ్బాయా..
అనేది చెప్పడం కుదరదు..
చట్టవ్యతిరేకం అన్నారు.
ఆన్లైన్‌లో కిట్లు సేల్ కి
ఉన్నాయిగా... ట్రై చేద్దాం !

## దైవప్రసాద కేంద్రాలు

# వ్యాపార కేంద్రాలు కాకూడదు

- అన్ని దేవాలయాల్లో భక్తులకు ఉచిత అన్నసమారాధన జరగాలి
- అన్నదాన ఏర్పాట్లను ప్రభుత్వమే భరించాలి
- దైవ, సేవా కార్యక్రమాలలో బొగ్గు శ్రీనును ఆదర్శంగా తీసుకోవాలి
- విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి



విశాఖపట్నంః సృష్టిలో దైవత్వమే మిన్న.. అందుకే నాటి నుండి నేటి వరకు మనిషికి ఏ కష్టం వచ్చినా, మనస్సుకు సంతోషం కలిగినా దైవాన్ని స్మరిస్తూ ఉంటాడు మానవుడు. ఆ దేవుళ్లకు నిలయాలు దేవాలయాలు. దేవాలయాలకు వచ్చిన భక్తులు దైవ దర్శనం అనంతరం సాధారణంగా ప్రదాస కేంద్రానికి వెళ్లి అక్కడ ప్రసాదాన్ని కొనుక్కొని స్వీకరిస్తుంటారు. అలా కాకుండా దేవాలయంలో ప్రసాద కేంద్రాలు వ్యాపార కేంద్రాలు కాకుండా ఆ దేవస్థానం కాని, లేదా దేవాదాయ ధర్మాదాయ శాఖ కాని ప్రసాదాన్ని భక్తులకు ఉచితంగా వితరణ చేసే విధంగా చర్యలు చేపట్టాలని విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి తరువాయి 2లో

# కౌమార బాలికల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు



## జాయింట్ కలెక్టర్- 2 నాగేశ్వరరావు

విజయనగరం : జిల్లాలోని కౌమారదశలో ఉన్న బాలికల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్టు జాయింట్ కలెక్టర్ -2 కె.నాగేశ్వరరావు చెప్పారు. జిల్లా కౌమార బాలల ఆరోగ్య సంరక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో జె.సి.-2 అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గురువారం 335 ఉన్నత పాఠశాలలు, 22 ప్రభుత్వ జూనియర్ కళాశాలల ద్వారా అందులో చదువుతున్న బాలికలకు రక్తహీనత నివారణకోసం ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలోని 1.56 లక్షల మంది కౌమార బాలికలు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది పర్యవేక్షణలో యీ మాత్రలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సోషల్ మార్కెటింగ్ ద్వారా ఒక్క రూపాయికే శానిటరీ నేప్కిన్ వారికి లభించేలా చర్యలు చేపట్టామన్నారు. కౌమార బాలికల్లో సంపూర్ణ ఆరోగ్య సంరక్షణకే రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్ కార్యక్రమం అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో 10 నుండి 19 ఏళ్ల మధ్య వయస్సులో మొత్తం 3.50 లక్షల కౌమార బాలికలు వున్నారని, వారికి పోషకాహారం, పునరుత్పత్తి ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం కల్పించి ఆరోగ్యవంతంగా రూపొందించడంపై కమిటీ జిల్లా సమావేశంలో చర్చించామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.పద్మజ, జిల్లా కోఆర్డినేటర్ డా.సుబ్రహ్మణ్యం తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

**జిల్లాలో ప్రభుత్వ సిబ్బందికి ఇ-ఆఫీస్ శిక్షణ**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బందికి ఇ-ఆఫీస్ శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రత్యేక ఉప కలెక్టర్ ఆర్.శ్రీలత తెలిపారు. జిల్లాలోని విజయనగరం, పార్వతీపురం డివిజన్లలో సోమవారం నుండి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. పార్వతీపురం డివిజన్‌లోని మండలాల సిబ్బందికి బొబ్బిలి సమీపంలోని కలవరాయి వద్ద వున్న స్వామి వివేకానంద ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ వుంటుందన్నారు. శిక్షణ షెడ్యూలును ఆమె విడుదల చేశారు.

ఈనెల 15న ఉదయం 9 గంటలకు జి.ఎల్.పురం, మధ్యాహ్నం 2 గంటలకు సీతానగరం మండలాల సిబ్బందికి, 16న ఉదయం కురుపాం, మధ్యాహ్నం పార్వతీపురం, 17న ఉదయం జియ్యమ్మవలసస మధ్యాహ్నం సాలూరు, 18న ఉదయం కొమరాడ, మధ్యాహ్నం తెర్లాం, 21న ఉదయం గరుగుబిల్లి, మధ్యాహ్నం బలిజిపేట, 22న ఉదయం పాచిపెంట, మధ్యాహ్నం రామభద్రపురం, 23న ఉదయం మక్కువ, మధ్యాహ్నం బాడంగి మండలాల వారికి శిక్షణ వుంటుందన్నారు. విజయనగరం డివిజన్‌కు సంబంధించి గాజులరేగలోని సితం ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ ఇస్తారని, 15న ఉదయం 9 గం.లకు మెరకముడిదాం, మధ్యాహ్నం 2 గం.లకు గంట్యాడ, 16న ఉదయం దత్తిరాజేరు, మధ్యాహ్నం డెంకాడ, 17న ఉదయం వేపాడ, మధ్యాహ్నం పూసపాటి రేగ, 18న ఉదయం కొత్తవలస, మధ్యాహ్నం భోగాపురం, 21న ఉదయం లక్కవరపుకోట, మధ్యాహ్నం బొండపల్లి, 22న ఉదయం ఎస్.కోట, మధ్యాహ్నం గజపతినగరం, 23న ఉదయం మెంటాడ, మధ్యాహ్నం జామి, 24న ఉదయం చీపురుపల్లి, మధ్యాహ్నం గుర్ల మండలాల శిక్షణ వుంటుందన్నారు. 24న ఉదయం గరివిడి, మధ్యాహ్నం నెల్లిమర్ల మండలాల సిబ్బందికి శిక్షణ కలెక్టరేట్ ఆడిటోరియం, విజయనగరంలో నిర్వహిస్తారని తెలిపారు.

# వైకాపా అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ది

**- రాష్ట్ర వైకాపా మహిళా విభాగం అధికార ప్రతినిధి ఈగలపాటి యువశ్రీ**



గాజువాక: రాష్ట్రంలోని వైయస్ఆర్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర వైకాపా మహిళా విభాగం అధికార ప్రతినిధి ఈగలపాటి యువశ్రీ పేర్కొన్నారు. నూత నంగా రాష్ట్ర వైకాపా అధికార ప్రతనిధి నియామకం అనంతరం సోమవారం చినగంట్యాడ నియోజకవర్గ పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని ఆవేదనను వ్యక్తం చేసారు. ఎక్కడబడితె అక్కడ మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని తెదేపా ప్రభుత్వం పై విరుచుకుపడ్డారు. అధికార దాహంతో తెదేపా ముందుకు పోతుందని, ప్రజల సమస్యల పరిష్కారంలో తెదేపా పూర్తిగా విఫలంమయ్యిందని విమర్శించారు. అమలు కాని హామీలను ఇచ్చి అధికారం లోకి వచ్చి ప్రజలను తెదేపా ప్రభుత్వం నిలువునా ముంచిందని మండి పడ్డారు. డ్వాక్రా మహిళలకు ఋణ మాఫీ పేరుతో మోసం చేస్తున్నారని ఇది రాష్ట్ర మహిళా లోకం గమనిస్తుందని అన్నారు. రాష్ట్ర వైకాపా మహిళా ప్రధాన కార్యదర్శి మల్ల ధనలత మాట్లాడుతూ మహిళల పట్ల తెదేపాకు చిత్త శుద్ధి లేదని, మహిళల అభివృద్ధికి ఎటువంటి కార్యక్రమాలను నిర్వహించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేసారు. రానున్నది వైయస్ కాలమని, వైకాపా అధికారం చేపట్టడం ఖాయమని జోష్యం చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలు వైకాపా వెంట ఉన్నారని, ప్రతిపక్షనేత, రాష్ట్ర వైకాపా అధ్యక్షులు వైయస్ జగన్ చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు ప్రజలు నీరాజనాలు పడుతున్నారని ఇదే నిదర్శనమని అన్నారు. ప్రజా సంకల్ప యాత్రతో ప్రజలు తెదేపాకు చరమగీతం పాడుతారని విమర్శించారు. తమకు రాష్ట్ర స్థాయిలో పదవి కల్పించిన జగన్‌కు, తమకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలను తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిటీ వైకాపా కార్యదర్శి శాంతకుమారి, మహిళలు, కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.

# ఫ్యాప్టో చలో అసెంబ్లీకి తరలి రావాలి



అచ్యుతాపురం: కాంట్రిబ్యూటరీ పెన్సన్ స్కీమ్ (సిపిఎస్) రద్దుకోసం ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమైఖ్య (ఫ్యాప్టో) ఈ నెల 15న నిర్వహించనున్న చలో అసెంబ్లీకి ఉపాధ్యాయ, ఉద్యోగులు తరలి రావాలని ఫ్యాప్టో జిల్లా కో-చైర్మెన్ జి.మదు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రమైన అచ్యుతాపురంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ తమ భావి జీవితానికి సామాజిక, ఆర్థిక భద్రత ఇవ్వని నూతన పించన్ పతకం పట్ల ఆందోళన చెందుతున్న ఉపాద్యాయ, ఉద్యోగులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన హిమర్శించారు. సిపిఎస్ రద్దు, పాత పించన్ విదానం పునరుద్దరనకు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో తీర్మాణం చేసి, కేంద్ర ప్రభుత్వం ఆదీనంలోని పించను నిధుల క్రమ బద్దీకరణ అభివృద్ది సంస్థ (పిఎఫ్ ఆర్‌డిఎ) నుండి తప్పుకోవాలని ఆయన డిమాండ్ చేసారు. దీనికోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు చలో అసెంబ్లీకి తరలి రావాలని ఉద్యోగ, ఉపాద్యాయులను ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్.నూకరాజు, డి.సత్యనారాయణ, కొల్లి రాజు, జి.వి.డి.ఎ.రాజు, ఎ.సన్నిబాబు, మొబీనా, వి.మురళీ, టి.నాగేశ్వర్రావు, ఎన్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ

# వారోత్సవ స్వర్ణోత్సవాలు

అచ్యుతాపురం: ఈ నెల 14 నుండి 20 వరకూ అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవ స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాదికారి డి.కోటేశ్వర్రావు తెలిపారు. దీనిలో బాగంగా వారం రోజుల పాటు గ్రాంథాలయ చైతన్య కార్యక్రమాలు 14వ తేదీన పథాక ఆవిస్కరణ బాల బాలికలతో ప్రారంభం కానున్నది. 15న వ్యాసరచన పోటీలు (హైస్కూల్ విద్యార్థులకు), 16న డ్రాయింగ్ పోటీలు (ప్రాదమిక పాఠశాల విద్యార్ధులకు), 17న కథలు, దేశ భక్తి గేయాలు, 18న క్విజ్, డిబెట్, 19న పదవీ అదికారిణిలతో చర్చా వేదిక, 20న ముగింపు సభ ఉంటాయన్నారు. విజేతలకు భహుమతులు కూడా ఉంటాయన్నారు.

## సిపిఐ నాయకుడు రజాక్‌కు పితృవియోగం

### సంతాపం తెలిపిన సిపిఐ రాష్ట్ర నాయకులు

నర్సీపట్నం : సిపిఐ నాయకుడు షేక్ రజాక్ తండ్రి షేక్ నాగూర్(68) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసు కున్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎజె.స్టాలిన్ తమ సంతాపాన్ని తెలియజేశారు. విశాఖజిల్లా సహాయ కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు రామునాయుడు, నర్సీపట్నం మండల కార్యదర్శి రుత్తల పెదబుజ్జి, రూరల్ కార్యదర్శి గిరిబాబు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వారా నూకరాజు, గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు పొట్టిక సత్యనారాయణ, అంగన్వాడీ అసోసియేషన్ (ఏఐటియుసి) జిల్లా అధ్యక్షులు మార్తి అప్పలరాజు, మహిళా సమాఖ్య నాయకురాలు భవాని తదితరులు రజాక్ నివాస స్థలమైన తాండవ చేరుకొని నివాళ్లు అర్పించారు. కేవలం కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందటాన్ని బట్టి విచారం వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమాలకు రజాక్‌కు ఎంతో వెన్నుదండుగా ఉండి సహకరించే వారని బాలేపల్లి వెంకటరమణ అన్నారు. శివలంక కొండలరావు తదితరులు తమ సంతాపాన్ని తెలిపారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నాతవరం : కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. ఉదయంనుంచి భక్తులు అధిక సంఖ్యలో గ్రామాల్లో ఉన్న ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించుకున్నారు. గ్రామాల్లో కార్తీక శోభ సంతరించుకుంది.

# పూడిమడక సముద్రతీరంలోకి రసాయన వ్యర్ధ జలాలు



జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

అచ్యుతాపురం : సెజ్‌లో గల ఫార్మా కంపెనీల రసాయన వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నేరుగా ఉప్పుటేరు ద్వారా పూడిమడక సముద్ర తీరంలోకి విడుదల చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్ టియుసి జిల్లా ప్రదాన కార్యదర్శి, మాజీ ఉప సర్పంచ్ చోడిపల్లి అప్పారావు అన్నారు. పూడిమడక సముద్ర తీరంలోకి రసాయన వ్యర్ధ జలాలను శుద్ధి చేయకుండా విడుదల చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్‌కు ఆయన మత్స్యకారులతో కలిసి ఫిర్యాదు చేసారు. సెజ్‌లో నిర్మాణమైన ఫార్మా రసాయన పరిశ్రమల వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నేరుగా సముద్రతీరంలోకి విడుదల చేయడం వలన చేపలు చనిపోతున్నాయన్నారు. పెద్ద ఎత్తున చేపలు చనిపోవడం వలన సముద్రంపై ఆదారపడి జీవిస్తున్న 3500 కుటుంబాలు జీవనోపాది కోల్పోతున్నామని వేరే ఉపాది లేక చాలా ఇబ్బందులు పడుతూ ఇతర ప్రాంతాలకు వలస పోవల్సి వస్తుందన్నారు. ఇప్పటికే పలుమార్లు తాహశీల్దార్‌కు ఫిర్యాదు చేసామాన్నరు. ఇప్పటికైనా తక్షణమే స్పందించి చేపలు చనిపోవటానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్ఆర్‌సిపి గ్రామ పార్టీ అద్యక్షులు మేరుగు అప్పలనాయుడుతో పాటు మత్స్యకారులు ఉన్నారు.

# నేటి నుంచి గ్రంధాలయ వారోత్సవాలు

రోలుగుంట : ఈ నెల 14 నుంచి జాతీయ గ్రంధాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు రోలుగుంట గ్రంధాలయాధికారి ఆర్.వరహామణి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా ప్రాధమిక, ప్రాధమికోన్నత, ఉన్నత, జూనియర్ కళాశాల విద్యార్ధినీ విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. 14న బాలల దినోత్సవం, 15న నేటి విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం. సీనియర్ విద్యార్థులకు గ్రంధాలయాలు. ప్రయోజనాలపై జూనియర్స్ విభాగంలో నిర్వహిస్తామన్నారు. 16న చిత్రలేఖనం పోటీలు,17న బాలబాలికలకు చదరంగం పోటీలు, 18న జూనియర్స్‌కు మాత్రమే మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహిస్తామన్నారు. 19న మహిళా దినోత్సవం ఇందిరాగాంధీ జయంతి, ముగ్గుల పోటీలను నిర్వహిస్తామన్నారు. 20న ముగింపు సభ, విజేతలకు బహుమతులు ప్రధాన కార్యక్రమం ఉంటుందన్నారు.

మొదటి పేజీ తరువాయి

# దైవప్రసాద కేంద్రాలు వ్యాపార కేంద్రాలు కాకూడదు

స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామి ప్రవచించారు. గ్రేటర్ విశాఖ 37వ వార్డు జై భారత్ నగర్ గ్రామాధ్యక్షుడు, మాజీ పీసీసీ సంయుక్త కార్యదర్శి, సంఘ సేవకుడు బొగ్గు శ్రీను తన స్వీయ నిధులతో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వాములకు నిత్య అన్న ప్రసాదాన్ని ఉచితంగా అందిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఈ నిత్యఅన్నదాన కార్యక్రమంలో విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి విచ్చేసి అయ్యప్ప పీఠాన్ని సందర్శించి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలలో ఉత్తర పీఠాధిపతి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులనుద్దేశించి మహా స్వామివారు మాట్లాడుతూ కార్తీక మాసం వచ్చిందంటే ఎక్కడ చూసినా అయ్యప్ప మాలలు, భవానీ మాలలు, చందన మాలలు, కనక మహాలక్ష్మి మాలలు ధరించి ఎక్కువ భక్తి శ్రద్ధలతో నియమనిష్టలతో ఉపవాసాలు, భజనలు చేసి తమ జన్మను సార్థకం చేసుకుంటుంటారు. ఎక్కడా లేని విధంగా కేవలం ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఈ భక్తులు ఎక్కువగా కనబడడానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. బొగ్గు శ్రీను చేస్తున్న భక్తి, సేవా కార్యక్రమాలను ఇతరులు ఆదర్శంగా తీసుకుని ఇటువంటి సేవా కేంద్రాలను నిర్వహించాలని సూచించారు. అన్ని దేవాలయాలలోనూ దర్శనానికి వచ్చిన భక్తులకు ఉచిత అన్న సమారాధన జరపాలని, ఆ సమారాధన ఖర్చును స్వచ్ఛంద సంస్థలు కాకుండా ప్రభుత్వమే వాటిని భరించాలని మహాస్వామి సూచించారు. తనకు అత్యంత ప్రియమైన వారిలో బొగ్గు శ్రీను ప్రముఖుడని, ఆయన ఉదారత, సేవా కార్యక్రమాలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బొగ్గు శ్రీను మాట్లాడుతూ మహాస్వామి వారి ఆశీస్సులతో ముందుందు మరిన్ని దైవ కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగించగలనని తెలిపారు. మహాస్వామి వారి ఆశీస్సులు తీసుకున్న వారిలో 37వ వార్డు వైకాపా అధ్యక్షుడు బొడ్డేటి నాగేశ్వరరావు, వార్డు ఎస్సీ సెల్ నాయకుడు పరమేశ్వర బాబు, బొగ్గు శ్రీను మిత్రమండలి సభ్యులు నల్లా కిరణ్ కుమార్, పుక్కళ్ల ప్రసాద్, కె. రమణ, విజయవాడ శ్రీను, దీనబంధు, దాసరి శ్రీను, మద్రిపాలెం చిన్న, సిద్దు, రమణారెడ్డి, సినీ ఆర్టిస్ట్ జోగి బ్రదర్, శ్రీ విశాఖ శారదా పీఠ ట్రస్టీ రొబ్బి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం మహాస్వామి వారిని బొగ్గు శ్రీను మిత్రమండలి సభ్యులు గజమాలతో సత్కరించి ఆశీస్సులు గైకొన్నారు.

## పర్యాటకుల ప్రాణాలతో చెలగాటమా?

అనుమతులు లేవు. ఆదివారం సాయంత్రం పర్యాటకులు వచ్చి మొదట పర్యాటక శాఖ బోటును ఎక్కారు. అయితే సమయం మించిపోయిందని వారు ఒప్పుకోలేదు. దీంతో ప్రైవేటు బోటు సిబ్బంది వారిని ఎక్కించుకుని నదిలోకి తీసుకెళ్లారు. దీంతో ఈ దుర్ఘటన జరిగింది అని చంద్రబాబు చెప్పారు.

సోమవారం ఉదయం వరకు బోటు ప్రమాదంలో మరణించిన 20 మంది మృతదేహాలను వెలికితీసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. పవిత్ర సంగమానికి వచ్చిన పర్యాటకులు అక్కడే మృతి చెందడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. క్షతగాత్రుల్లో 21 మందిని ఆసుపత్రికి తరలించగా వారిలో 17 మంది డిశ్చార్జి అయ్యారని, మరో నలుగురు ఇంకా చికిత్స పొందుతున్నారని చంద్రబాబు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తున్నట్లు ఆయన చెప్పారు.

## వైష్ణోదేవి దర్శనానికి 50వేల మందికి మాత్రమే అనుమతి

ఉంటున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణ సామర్థ్యం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

అంతేగాక.. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణాలను కూడా నిలిపివేస్తున్నట్లు ఎన్‌జీటీ తెలిపింది. నవంబర్ 24న వైష్ణోదేవి ఆలయానికి వెళ్లే కొత్త మార్గాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొంది. ఇది కేవలం పాదచారులు, బ్యాటరీ కార్లకు మాత్రమేనని.. గుర్రాలపై ఎక్కి వెళ్లడానికి ఈ కొత్త రహదారి గుండా అనుమతి లేదని స్పష్టం చేసింది.

ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన వైష్ణోదేవి ఆలయాన్ని ఏటా లక్షల మంది భక్తులు దర్శించుకుంటారు. ఈ ఏడాది అక్టోబర్ వరకు 69.34లక్షల మంది భక్తులు ఈ ఆలయానికి వచ్చారు. అయితే ప్రకృతి విపత్తులు, ఉగ్రదాడి నేపథ్యంలో ఇటీవల భక్తుల రద్దీ స్వల్పంగా తగ్గినట్లు తెలుస్తోంది.

## అన్ని నేరాలనూ ఆపలేం

దర్యాప్తు చేపడుతున్నారని నిందితులు ముస్లింలు అయినా హిందువులైనా వదిలేది లేదని వ్యాఖ్యానించారు. గతంలో అల్వార్ ప్రాంతానికి చెందిన పెహ్లూ ఖాన్ అనే వ్యక్తి గోసంరక్షకుల దాడిలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా దుమారం రేపింది.

## 2021 తర్వాతే రిటైరవుతా

స్పష్టంచేశారు. కార్పొరేట్ కళాశాలలపై కఠినంగా ఉంటామన్నారు. ఈ విషయంలో సీఎం కూడా సీరియస్‌గా ఉన్నారని చెప్పారు. ఇటీవల కార్పొరేట్ కళాశాలతో జరిగిన సమావేశంలో ఈ విషయం స్పష్టంగా చెప్పామన్నారు. విద్యావ్యవస్థ పూర్తిగా గాడిలో పడాలంటే మరో ఐదేళ్లు పడుతుందన్నారు.

## ప్రకృతి ప్రకోపం..



ఆదివారం రాత్రి భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 7.3గా నమోదైంది. ఈ విపత్తులో ఇప్పటివరకు 328 మంది మృత్యువాత పడగా.. వేల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు.

తూర్పు ఇరాక్ హలబ్జా నగరానికి 31 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఇరాన్‌లోని 14 ప్రావిన్స్‌ల్లో భారీ నష్టం సంభవించింది. భూకంపం కారణంగా అనేక భవనాలు కుప్పకూలిపోయాయి. శిథిలాల కింద చిక్కుకుని వందల సంఖ్యలో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రాణాలతో బయటపడ్డ వారు రోడ్లపైనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. భూకంప ప్రాంతాల్లో అధికారులు సహాయకచర్యలు ముమ్మరం చేశారు. భూకంపం తర్వాత మరో 50సార్లు ప్రకంపనలు వచ్చాయి. దీంతో ప్రజలు క్షణక్షణం భయంభయంగా గడుపుతున్నారు. ఒక్క సర్పోలే జహబ్‌లోనే 142 మంది చనిపోయినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇరాన్, ఇరాక్‌ల్లోని పలు నగరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

*ప్రధాని మోదీ దిగ్భ్రాంతి*

ఇరాక్ భూకంపంపై భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇరాక్, ఇరాన్ భూకంపంలో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు మోదీ తెలిపారు.



*వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన మాజీ శాసనసభ్యులు తైనాల విజయకుమార్ సోమవారం ఉదయం జగదాంబ జంక్షన్‌లో గల పార్టీ కార్యాలయమందు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసిన వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా రాజీవ్ గాంధీ*

## 17న మహా కామేశ్వరి పీఠంలో
# స్వాతి నక్షత్రంతో కాల సర్ప దోష నివారణ నాగశాంతి మహా యజ్ఞం
### - 2018 నుంచి భారతదేశానికి కాల సర్ప దోషం

విశాఖపట్నం : 2018లో యావత్ భారతదేశానికి గ్రహ మండలంలో కాలసర్పదోషం సంభవిస్తుంది. ఆ కారణంగా 2018 సంవత్సరం రాకముందే జాతకంలో కాలసర్పదోషం ఉన్నవారు వెంటనే కాలసర్ప దోష నివారణ చేసుకోవాల్సిందిగా యద్దనపూడి అయ్యన్నపంతులు గారు కోరారు. పెందుర్తి శ్రీ సాధుమఠం దరిలో గల శ్రీ మహా కామేశ్వరి పీఠంలో నవంబర్ 17న చతుర్ధశి స్వాతి నక్షత్రం. ఈ స్వాతి నక్షత్రంతో శ్రీ మానసా దేవి మహా యజ్ఞం, నాగదేవతా మహా యజ్ఞం జాతకంలో గల కాల సర్ప దోష నివారణ నాగశాంతి మహా యజ్ఞంను మహర్షి శ్రీ యద్దనపూడి అయ్యన్న పంతులు ఆధ్వర్యంలో జరుగనున్నది. కార్తీకమాసం స్వాతి నక్షత్రం వృశ్చిక సంక్రమణం అవ్వడం నాగశాంతి మహా యజ్ఞానికి చాలా అనుకూలమైన దినం. జాతకంలో ఆశ్లేష నక్షత్రం వారికి ఈరోజున నాగ ప్రతిష్ఠ చేయించుకున్నా కాల సర్ప దోష నివారణ వెంటనే జరిగి సత్ఫలితాలను పొందుతారు. అలాగే ఆరుద్ర శతభాషా నక్షత్రం వారు అశ్విని నక్షత్రం వారు, అశ్వనీ మఖ, మూలా నక్షత్రం వారు కాలసర్ప దోష నివారణ చేయించుకుంటే ఆరోగ్యం వెంటనే చేకూరుతుంది. ఈ యజ్ఞం మహా కామేశ్వరి పీఠంలో నవంబరు 17న ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు మూడు భాగాలుగా నిర్వ హిస్తారు. భక్తులు విరివిగా ఈ నాగశాంతి మహా యజ్ఞంలో పాల్గొనాల్సిందిగా మహర్షి యద్దనపూడి అయ్యన్న పంతులు కోరారు.


యద్దనపూడి అయ్యన్నపంతులు

# లంబసింగిలో క్రీడా శిక్షణా సంస్థ ఏర్పాటు
### మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు


సభలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు


గౌరవవందనం చేస్తున్న క్రీడాకారులు

మాకవరపాలెం ; విశాఖపట్నం జిల్లాలోని నర్సీపట్నంను విద్యాకేంద్రంగా తయారుచేసేందుకు తను చేస్తున్న కృషి ఒక్కొక్కొటిగా తీరుతుందని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. సోమవారం మాకవరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వజోన్ గ్రిక్ పోటీలను ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోనికి వచ్చిన నాటినుంచి క్రీడలు, విద్యాభివృద్ధిని ఎంతగానో ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావు తన కోరికను మన్నించి నర్సీపట్నంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అనుమతిచ్చారన్నారు. జిల్లాలోని నర్సీపట్నంలో రూ.2కోట్లతో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇక్కడ బాక్సింగ్, వాలీబాల్ క్రీడలకు కోచ్‌ల ద్వారా శిక్షణ ఇప్పిస్తామన్నారు. లంబసింగిలో రూ.14కోట్ల వ్యయంతో క్రీడా శిక్షణా సంస్థ ఏర్పాటును ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ లాలం భవాని మాట్లాడుతూ విద్యాలయాల్లో క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ కె.సూర్యారావు, డిప్యూటీ డీఈఓ సి.వి.రేణుక, జడ్పీటీసీ కసిపల్లి కుమారి, ఎంపీపీ రుత్తల చిన్నయ్యమ్మ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడిగర్ల అప్పలనాయుడు, టిడిపి నాయకులు రుత్తల శేషుకుమార్, శీరంరెడ్డి సూర్య నారాయణ, రుత్తల రమణమ్మ, తహసీల్దార్ తారకేశ్వరి, ఎంపీడీఓ ఎం.ఉదయశ్రీ, ఎంఈఓ సాయిశైలజ తదితరులు పాల్గొన్నారు.

# అభయ హస్తం ద్వారా రూ.10,000లు అందజేత



మాధవధార: శ్రీ అభయ అంజనేయ ట్రస్ట్ నిర్వహిస్తున్న అభయహస్తం ద్వారా లీలారాణికు రూ. 10,000లను ముఖ్య అతిధిగా విచ్చేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తర నియోజక వర్గం సమన్వయకర్త సత్తిరామకృష్ణరెడ్డి చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమం శ్రీ అభయ అంజనేయ ట్రస్ట్ చైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తర నియోజక వర్గం సమన్వయ కర్త సనపల చంద్రమౌళి అద్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సత్తి రామకృష్ణరెడ్డి మాట్లాడుతూ ఉత్తర నియోజక వర్గంలోని పేద ప్రజలకు గుర్తించి వితంతువుల పిల్లల చదువు నిమిత్తం ఇటువంటి సేవ కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినంద నీయమని అన్నారు. ప్రతి 15 రోజుల కోకసారి ఈ కార్యక్రమం నిర్వహస్తున్నట్లు సనపల చంద్రమౌళి తెలిపారు. ఈ కార్యక్రమంలో పప్పల సునీత, సనపల ఉమాపతి, గుంపుల శరత్‌బాబు, 41వ వార్డు వైఎస్ఆర్ సిపి అధ్యక్షులు చల్లా ఈశ్వరరావు, 40వ వార్డు మాజి కార్పొరేటర్ వల్లీ తదితరులు పాల్గొన్నారు.

# భీమునిపట్నం అప్పికొండవీధి టిఎస్ నెం.162లో ఉన్న వారిని
# ఖాళీ చేసి వెళ్ళమని బెదిరింపులు

భీమిలీ : భీమునిపట్నం జోన్‌లో గల 23 వార్డు అప్పికొండ వీధి పూసపాటి విజయరామ గజపతిరాజు నగర్‌లో సుమారు 50 సంవత్సరాల నుండి సుమారు 140 కుటుంబాలు జీవిస్తున్నారు. టిఎస్ నెం.162 సుమారు పది వేల చదరపు గజముల స్థలములో పాకలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు యున్నారు. గత ప్రభుత్వంలో కాలనీవాసులకు ఇందిరమ్మ పథకం లోనులు తీసుకొని పక్కా గృహాలు నిరిమించుకున్నారు. ఈ కోలని వాసులు ఇంటి పన్నులు కూడా ప్రభుత్వం కు చెల్లిస్తున్నారు. ఈ స్థలం పై భూమి బకాసురులు కన్ను పడింది. ఈ స్థలం మాదని మాకు రిజిస్ట్రేషన్ అయినదని కొంత మంది గుండాలను తీసుకొని వచ్చి ఈ స్థలమును కాలిజేసి వెళ్ళమని బెదిరిస్తూ వున్నారు.ఈ స్థలం 2000 సంవత్సరం లో ఎం వి ఎస్ మూర్తి ఆర్థిక సహాయంతో సామాజిక భవనం కూడా ఏర్పాటు చేసుకున్నాం, ఈ స్థలం వివాదం పై ఫిర్యాదు చేయుటకు మంత్రి గంటా శ్రీనివాసరావుకు, జివిఎంసి కమిషనర్‌కు, కలెక్టర్‌కు కాలనీ వాసులు, టి.డి.పి. నాయకులు అప్పికొండ అప్పలనాయుడు, కనకల అప్పల నాయుడు, అప్పికొండ నూకరాజు, కాలనీ వాసులు ఆటోలలో సుమారు 200 మంది కలెక్టర్ కార్యాలయం కు ర్యాలిగా బయలుదేరి వెళ్ళారు.రేపు భీమిలి తహశీల్దార్‌కు జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తామని టి.డి.పి.నాయుకులు అప్పికొండ అప్పలనాయుడు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ కాలనీ లో ఉన్న వారంతా కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారని వారికీ న్యాయం చేయడానికి కృషి చేస్తానని అన్నారు.

# ఘనంగా వైసీపీ వన సమారాధన




అనకాపల్లి : పట్టణంలో గవరపాలెంలో శ్రీ మరిడిమాంబ ఆలయ ప్రాంగణంలో వైఎస్ఆర్‌సిపి పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధను 26, 27, 28, వార్డులకు సంబందించి, వైఎస్ఆర్‌సిపి కార్యకర్తలతో నిర్వహించారు. ఈ సందర్బంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అనకాపల్లి పార్లమెంట్ నియోజక వర్గం కన్వీనర్ గుడివాడ అమర్‌నాధ్ ప్రోత్సాహంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. అమర్ నాయకత్వంలో గవరపాలెంలో ఉన్న సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ఈ నెల 18వ తేదీన రాజీవ్ ఇండోర్ స్టేడియంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించ నున్న రచ్చబండ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ రచ్చబండలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం జరుగు తుందని ఆయన అన్నారు. ఈ రచ్చబండ కార్యక్రమంలో గుడివాడ అమర్‌నాధ్, దంతులూరి దిలీప్‌కుమార్, మందపాటి జానకీ రామరాజు పార్టీ నేతలు, పాల్గొంటారని ఆయన వివరించారు. అనంతరం గవరపాలెం పార్టీ కార్యకర్తలు ఆళ్ల నాగేశ్వరరావు పార్టీకోసం చేస్తున్న సేవలకు గుర్తింపుగా పుష్పగుచ్చం అందించి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గరికిన రామకృష్ణ, చదరం వాసు, ఎమ్‌డి యూషప్‌తో పాటుగా సుమారు 200 మంది పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### స్వచ్ఛభారత్ కార్యక్రమంలో
# ప్రజలు భాగస్వామ్యం కావాలి
### -భాజపా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు ప్రేమకుమారి




గాజువాక: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం కావాలని భాజపా మహిళా మోర్చా జిల్లా అద్యక్షులు ప్రేమకుమారి పేర్కొన్నారు. సోమవారం జీవీయంసీ 64వ వార్డు గిరిప్రసాంత్ నగర పరిదిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరప్రాంతాలలో చెత్తను ఏరి శుభ్రపరిచారు. ఈ సందర్బంగా ప్రేమకుమారి మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోది పిలుపు మేరకు ప్రజలు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో విరివిరిగా పాల్గొని భారతదేశాన్ని ఆరోగ్యవంతమైన దేశంగా రూపు దిద్దుకునేందుకు కృషి చేయాలని అన్నారు. ఆరోగ్యవంతమైన జీవితం గడపాలంటే ముందు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. మనం ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏపనినైనా శులభంగా చేయవచ్చునని అన్నారు. అరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని గుర్తు చేసు కోవాలని అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా స్వచ్ఛభారత్ కార్య క్రమంలో పాల్గొని స్వచ్ఛ విశాఖ, స్వచ్ఛభారత్ కు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు భాజపా అధ్యక్షులు గోటూరి శంకరరావు, ఇంచార్జ్ బాటాశ్రీనివాసరావు, నాయకులు మోహన్ రావు, గోలిశంకరరావు, వి.వరలక్ష్మి, బి.లక్ష్మి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా భోగలింగేశ్వరుని
# పంచామృతాభిషేకం



అనకాపల్లి : కార్తీకమాసం నాల్గవ సోమవారం పురస్కరించుకుని గవరపాలెంలో గల భోగలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన పలు అభిషేకాలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నాలుగుగంటల నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఘంటస్థంభం వద్ద, జమ్మిచెట్టు, తులసీమొక్కల వద్ద మహిళలు ప్రదర్శనాలు చేశారు. 365 వత్తులతో కూడిన దీపారాధన చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుడం ఆలయ చైర్మన్ మళ్ల సత్యనారాయణ , డైరెక్టర్లు దొడ్డి జగదీశ్వరరావు, కర్రి మల్లేశ్వరరావు, తదితరులు జాగ్రత్తలు తీసుకున్నారు.

### వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో
### ఉచిత వైద్య శిబిరం




అనకాపల్లి : అనకాపల్లి గాంధీనగరం జీవిఎంసి ప్రాధమిక పాఠశాలలో శ్రీ వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కె. విష్ణుమూర్తి చిల్డ్రన్స్ డే సందర్బంగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌లో సుమారు 100 మంది విద్యార్థులకు ఉచితంగా వైద్య పరిక్షలు నిర్వహించి, ఉచితముగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐ. శోభారాణి, ఉపాధ్యాయులు ఎం. ఉమామహేశ్వరరావు, బి. రవింద్రపాత్రుడు, బి. రామాంజనేయులు. బి. రాజేశ్వరి , ఆర్. రామలక్ష్మి, పి. పల్లవి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, కార్యకర్తలు మరియు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# అంతకాపల్లి అయ్యప్ప సేవా పీఠం వద్ద భారీ అన్న సమారాధన


అన్నదానాన్ని ప్రారంభించిన గొంప రమణ

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో వున్న శ్రీ అయ్యప్ప సేవా పీఠం వద్ద గ్రామ ప్రజలు భక్తులు ఆర్థిక సహాయంతో అయ్యప్పస్వాములు ఆధ్వర్యంలో పదిహేను వందల మందికి భారీ అన్న సమారాధన సోమవారం జరిగింది. అయ్యప్పస్వామికి ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప సేవాపీఠం అధ్యక్షుడు గొంప రమణ, ఉప అధ్యక్షుడు మిడతాడ కనకరాజు, పాలకవర్గ సభ్యులు ఈ పూజలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ఈ అన్నదాన కార్యక్రమాన్ని అధ్యక్షుడు గొంప రమణ ప్రారంభించి ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని అన్నం పరబ్రహ్మ స్వరూపమన్నారు. ఈ అయ్యప్పస్వామి సేవా పీఠం వద్ద దసరా వెళ్ళిన తరువాత మాలలు వేసి 41 రోజులు దీక్షలు ఉదయం, సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి శబరియాత్రకు వెళ్ళేముందు అన్నదాన కార్యక్రమం జరపడం గత ఐదు సంవత్సరాలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా పీఠం సెక్రటరీ వనం సూర్యనారాయణ, పాలకవర్గ సభ్యులు గండి అప్పలనాయుడు, వానపల్లి ముత్యాలరావు, అనకాపల్లి పైడిలింగం, వెన్నల సత్యనారాయణ, గొర్లి దేముడుబాబు, సోమునాయుడు, స్వాములు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి
### మంత్రి అయ్యన్నపాత్రుడు


పంచాయతీరాజ్ అతిధి గృహం, మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ పనులు పరిశీలన

నర్సీపట్నం : అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం ఆయన నిర్మాణంలో ఉన్న పంచాయతీరాజ్ అతిధి గృహం, మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్‌ను పిలిపించి పనులు ఎలా జరుగుతున్నాయని, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాంట్రాక్టర్‌తో నిర్మాణ పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయ భవనంలో మీటింగ్ హాలుకు ఎంత మంది వస్తారని ఎంపిపి రమణమ్మను ప్రశ్నించారు. అందుకు తగినట్లు గానే మీటింగ్ హాలు నిర్మించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. భవన నిర్మాణానికి సంబంధించి గోడలకు ప్లాస్టింగ్ కూడా వినూత్న తరహాలో ఉండాలన్నారు. నెల్లూరులో కొత్త తరహాలో భవన నిర్మాణం జరుగుతుందని అక్కడ వారిని పిలిపించి అదే తరహాలో ఇక్కడ కూడా నిర్మాణం చేయాలని చర్యలు తీసు కోవాలని పంచాయతీ రాజ్ ఇఇ సంపత్‌కుమార్‌ను ఆదేశించారు. ఆయనతో పాటు పంచాయతీరాజ్ ఇఇ సంపత్‌కుమార్, డిఇ సత్యం నాయుడు, ఎంపిపి రమణమ్మ, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# సిపిఎస్ రద్దుకై 15న ఛలో అసెంబ్లీ

నర్సీపట్నం : సిపిఎస్ రద్దుకై నవంబర్ 15న ఛలో అసెంబ్లీకి ప్యాప్టో(ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) ఇచ్చిన పిలుపును విజయవంతం చేయాలని ప్యాప్టో సభ్యులు, యుటిఎఫ్ జిల్లా సహ అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో 1,80,000 మంది ఉద్యోగ ఉపాధ్యాయులకు పదవీ విరమణ అనంతరం సామాజిక ఆర్థిక భద్రత లేని ఈ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలులో చేయాలనే ఏకైక డిమాండ్‌తో దీనిని చేపట్టామన్నారు. దీని కొరకు మొదటి దశలో ఈ నెల 3, 4 తేదీలలో జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ధర్నా చేపట్టామన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో నవంబర్ 15న చలో అసెంబ్లీకి పిలుపునిచ్చామన్నారు.

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని కేంద్రాల్లో కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయాలనే రిమాండ్‌తో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నా ప్రస్తుత తరుణంలో దీనిని నిర్వహిస్తున్నామన్నారు. విజయవాడలో తుమ్మలపల్లి కళా క్షేత్రం నుండి ఉదయం 9 గంటలకు సిపిఎస్ ఉద్యోగులు ఉపాధ్యాయులు తరలిరావాలని దాసరి కోరారు.

# విజయభాను
## సంపాదకీయం

### చర్చలతోనే శాంతి స్థాపన

గత దశాబ్దంన్నరలో చర్చలు అనేక దశలుగా సాగాయి. మాజీ కేంద్ర మంత్రి కె.సి. పంత్, కశ్మీర్‌లో ప్రస్తుతం గవర్నర్‌గా ఉన్న ఎన్.ఎన్. వోహ్రా గతంలో చర్చలకు ప్రాతినిధ్యం వహించారు. ముగ్గురు సభ్యుల కమిటీ కూడా కొంత కాలం చర్చలు జరిపింది. ఇప్పుడు దినేశ్వర్ శర్మ నియామకం కూడా ఇదే ప్రయత్నాలకు కొనసాగింపు. కశ్మీర్ సరిహద్దులో ఉన్న రాష్ట్రం. పక్కన పాకిస్థాన్ తీవ్రవాదాన్ని ఎగదోస్తున్నది. కశ్మీర్‌లో సాధారణ ప్రజలకు ప్రభుత్వ చర్యల పట్ల విశ్వసనీయత లేదు. ఈ పరిస్థితుల్లో శాంతి స్థాపనకు ఎంతో సహనంతో ప్రయత్నాలు జరుగాలె. రాత్రికి రాత్రే అద్భుతాలు జరుగవు. కానీ అంతిమంగా చర్చల ద్వారానే సమస్య పరిష్కారం అవుతుందనే స్పృహతో వ్యవహరించాలె. రక్తమోడుతున్న కశ్మీర్ లోయలో శాంతిస్థాపన మరింత సంక్లిష్టంగా మారినట్టు కనిపిస్తున్నది. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి దినేశ్వర్ శర్మ కశ్మీర్ పర్యటన ఏ మాత్రం ఆశాజనకంగా జరుగలేదు. శర్మ గవర్నర్‌ను, ముఖ్యమంత్రిని కలుసుకోవడం సాధారణమే. ప్రతిపక్షమైన నేషనల్ కాన్ఫరెన్స్‌లో శర్మ పర్యటన పట్ల ఆసక్తి వ్యక్తం కాలేదు. శర్మ నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లాతో చర్చించారు. కానీ నేషనల్ కాన్ఫరెన్స్ ప్రతినిధి బృందం శర్మను కలువ లేదు. శర్మ ఒమర్ అబ్దుల్లాను కలిసింది వ్యక్తిగత స్థాయిలోనే అని నేషనల్ కాన్ఫరెన్స్ ప్రకటించింది. తమ నాయకుడు చర్చలలో పాల్గొన్నట్టు అంగీకరించడానికి కూడా నేషనల్ కాన్ఫరెన్స్ సంకోచిస్తున్నది. మొదట శర్మ కర్తవ్యమేమిటో స్పష్టం చేయాలని కాంగ్రెస్ ప్రతినిధి బృందం ప్రశ్నించింది. కశ్మీర్‌లో మూడు రోజుల పాటు మకాం వేసిన శర్మను దాదాపు డెబ్బయి ప్రతినిధి బృందాలు కలుసుకున్నట్టు చెబుతున్నారు. కానీ ఇవేవీ చెప్పుకోదగిన సంస్థలు కాదు. కశ్మీర్‌లో అశాంతిని సృష్టిస్తున్న వేర్పాటువాదులు ఎవరూ శర్మను కలుసుకోలేదు. వేర్పాటువాదులలో భిన్న వర్గాలున్నాయి. వీరిలో ఉదారవాదులు చర్చల పట్ల సుముఖంగా ఉంటారు. భారత్ పట్ల వ్యతిరేకతను ప్రదర్శించరు. ఇటువంటి వారిని కూడా కేంద్రం చర్చలలో భాగస్వాములను చేయలేకపోయింది. వేర్పాటువాదుల సంగతెట్లా ఉన్నా, సాధారణంగా కశ్మీర్‌లోయలోని వ్యాపార సంఘాలు, పర్యాటక సంస్థలు శాంతి చర్చలకు సముఖంగా ఉంటాయి. కానీ కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిని ఈ సం స్థలు కూడా శర్మను కలుసుకోకపోవడం ఆశ్చర్యకరం. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా వచ్చినప్పటికీ శర్మ పరిధి ఏమిటి, లక్ష్యమేమిటనేది మొదటి నుం చి అస్పష్టంగా ఉన్నది. కేంద్ర ప్రభుత్వం కశ్మీర్ విషయంలో ఎటువంటి విధానం అనుసరించదలుచుకున్నదనేది కశ్మీర్‌లోని రాజకీయ శక్తులకే కాదు, ఢిల్లీలోని రాజకీయ పక్షాలకు కూడా అర్థం కావడం లేదు. కొద్దికాలం కిందట మాజీ ప్రధాని మన్మోహ న్ సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ బృందం కశ్మీర్‌లోయలో రెండు రోజులు పర్యటించినప్పుడు విశేష స్పందన కనిపించింది. ప్రతిపక్షాలతో పాటు, బార్ అసోసియేషన్, వాణిజ్య సంఘాలు, పర్యాటక సం ఘాలు ఆయనను కలుసుకున్నాయి. అనేక ప్రతిపాదనలు ముందుకు వచ్చాయి. దినేశ్వర్ శర్మ పర్యట న మాత్రం పెద్దగా స్పందన లేకుండానే గడిచింది. దినేశ్వర్ శర్మ నియామకం జరిగిన తరువాత కేంద్ర స్థాయిలో కొందరు మంత్రుల ప్రకటనలు తప్పుడు సంకేతాలు ఇచ్చాయనే అభిప్రాయం ఉన్నది. కేంద్రం చర్చలను మొక్కుబడిగా సాగిస్తున్నదనే అభిప్రాయం ఏర్పడ్డది. అందువల్లనే చర్చలకు సుముఖంగా ఉండే తీవ్రవాద సంస్థలు కూడా వెనుకాడాయని అంటున్నారు. చర్చలకు రాజకీయవాదిని నియమిస్తే బాగుండేదనే సూచన కూడా ఉన్నది. దినేశ్వర్ శర్మ గూఢచార సంస్థ (ఐబీ) డైరెక్టర్‌గా పనిచేశారు. జాయింట్ డైరెక్టర్ హోదాలో ఇస్లామిక్ ఉగ్రవాదం విభాగానికి అధిపతిగా ఉన్నారు. జమ్ముకశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్ అధిపతిగా కూడా వ్యవహరించారు. కశ్మీర్ వ్యవహారాలపై శర్మకు అనుభవం ఉన్నది. మొదట శర్మ ఇచ్చే నివేదికను పరిశీలించిన తరువాత తదుపరి అడుగులు వేయాలని కేంద్రం భావిస్తున్నట్టు హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాటలను బట్టి తెలుస్తున్నది. అందువల్ల శర్మ పర్యటన నిరాసక్తంగా గడిచినప్పటికీ, విఫలమైందని ఈ దశలో చెప్పలేం.

దినేశ్వర్ శర్మను ప్రతినిధిగా పంపించినప్పటికీ కశ్మీర్‌లో కఠిన విధానం అనుసరించాలని ప్రధాని మోదీ ప్రభుత్వం నిర్ణయించిందనేది స్పష్టం. ఈ ఏడాది ఆపరేషన్ ఆలౌట్ అంటూ మిలిటెంట్ల ఏరివేత చర్య ప్రారంభించింది. ఈ ఏడాదిలో అక్టోబర్ నెల నాటికి 240 మిలిటెంట్ కార్యకలాపాలు చోటు చేసుకున్నాయి. 176 మంది మిలిటెంట్లు, 65 మంది భద్రతా సిబ్బంది, 65 మంది పౌరులు మరణించారు. 2016లో 322 మిలిటెంట్ కార్యకలాపాలు చోటు చేసుకున్నాయి. అయినా కశ్మీర్‌లో క్షేత్ర స్థాయిలో మార్పు కనిపించడం లేదు.

## శ్రీశ్రీశ్రీ చింతామణి గణపతి ఆలయంలో వైభవంగా రుద్రాభిషేకం





సింథియా: పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం ఐఒసి సమీపంలోని శ్రీశ్రీశ్రీ చింతామణి గణపతి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం సంధర్భంగా శివునికి వైభవంగా రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుల సమక్షంలో శివునితకి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు వేల సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఉమామహేశ్వర్ మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ చింతామణి గణపతి ఆలయంలోని శివార్చన చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసమని అన్నారు. ప్రతీ ఏడాది కార్తీక మాసంలో శివునికి రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, ప్రత్యేకపూజలను నిర్వహిస్తామని తెలిపారు. చుట్టుప్రక్కల భక్తులే కాకుండా మారుమూల ప్రాంతంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. కార్తీక మాసంలో ప్రతీ రోజూ శివునికి ప్రత్యే పూజలు, అర్చనలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటు వంటి అసౌకర్యం కల్గకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శివభక్తులే కాకుండా అయ్యప్ప భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, అయ్యప్ప భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## రత్నగిరికి పోటెత్తిన జన సంద్రం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్ని దర్శించుకొనేందుకు కార్తీకమాసము ఆఖరి వారము కావడంతో భక్తులు రాష్ట్ర నలుమూలల నుండి తండోప తండాలుగా వచ్చారు. భక్తుల రద్దీ కారణంగా దేవస్థానం అధికారులు అర్థరాత్రి నుండి స్వామివారి వ్రతాలు మరియు సర్వదర్శనాలు ప్రారంబించారు. అర్థరాత్రి నుండి భక్తులు రత్నగిరి కొండపై ఉన్న రావిచెట్టు దగ్గర దీపారాధనలు చేసుకొని.శ్రీస్వామివారి వ్రతాలు,దర్శనాలు, ఆచరించారు.

స్వామి దర్శనంకు వచ్చు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకమైన క్యూ లైన్స్ ఏర్పాటు చేసారు.వ్రతములు సుమారు 12,000 అయ్యాయి. స్వామివార్ని భక్తులు సుమారు 70,000 మంది వరకు దర్శించుకొన్నారు.గత ఏడాది కంటే ఈ సంవత్సరం భక్తులు అధిక సంఖ్యలో దర్శించి శ్రీ స్వామివారి వ్రతాలు ఆచరించారు.దేవస్థానం అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక క్యూ లైన్ లను ఏర్పాటు చేసారు. భక్తులకు ఉచితంగా పులిహోర, దద్ధోజనం వితరణ చేసారు.

## కైలాసభూమి అభివృద్ధికి శంకుస్థాపన

అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరంలో ఎన్నో సంవత్సరములుగా అభివృద్ధికి నోచుకోని శ్మశానవాటిక అభివృద్ధికి ఆదివారము మొదటి అడుగు పడింది.అయితే అన్నవరం పుణ్యక్షేత్రము కావడముతో దినదినాభివృద్ధి చెందుతుంది. కానీ నేటి వరకు గ్రామానికి శ్మశానవాటిక అనేది లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుచున్నారు.దేవస్థానం వారు గాని,గ్రామ పంచాయతీ వారు గాని ఇప్పటి వరకూ ఎవరూ పట్టించుకొనే నాదుడు లేక పోవడంతో గ్రామంలో ఉన్న రోటరీ క్లబ్ ,లయన్స్ క్లబ్, వాసవి క్లబ్ తో పాటు గ్రామంలో ఉన్న ఉదార స్వభావము గల దాతల సహాయంతో సుమారు 5 లక్షల వ్యయంతో ఈ శ్మశానవాటికను అభివృద్ధి చేయడానికి నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో రోటరీ,లైన్స్, వాసవి క్లబ్ సభ్యులు ఘంటసాల. వెంకట్,రవి మాష్టారు, రేపాక.వీర్రాజు, దాసరి.శంకర్, దాసరి.మురళి , మడ్డు.వీరబాబు తెలుగుదేశం టౌన్ ప్రెసిడెంట్ వీర్ల.సూరిబాబు, బండారు. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎస్‌ఎఫ్ ఫోర్స్ సిబ్బందికి రెస్క్యూ పవర్ బోట్ శిక్షణ

కాకినాడ : ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొడక్షన్ ఫోర్స్ 6వ బ్యాచ్‌కు చెందిన సిబ్బందికి రెస్క్యూ పవర్ బోట్ శిక్షణ కార్యక్రమం సోమవారం యాకర్‌ఏజ్ పోర్టు కస్టమ్స్ ఘాటి ఎస్‌పిఎఫ్ కార్యాలయం నందు ప్రారంభించారు.ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా రాజమహేంద్రవరం జోన్ కమాండెంట్ డిఎన్ఏ.బాషా విచ్చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన సిబ్బంది పకృతి వైపరీత్యాలు ,తుఫాన్‌లు సంభవించినప్పుడు సహయ పడేందుకు ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా రాష్ట్రంలో ఎస్‌పిఎఫ్ సిబ్బందికి విడతల వారీగా కాకినాడ యాంకరేజ్ పోర్టు, కస్టమ్స్ ఘాటి ఎస్‌పిఎప్ కార్యలయంనందు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.ఈ శక్షణలో నీటిలో పడిపోయిన వారిని ఈత కొడుతూ వెళ్ళి కాపాడటం,ప్రధమ చికిత్సఅందించడం,బోట్స్ నడపడం , సముద్రం లోపలున్న వస్తువులను వెలికి తీయడం వంటి అంశాలలో శిక్షణ ,ఇప్పటి వరకు కోచ్‌ల ఆధ్వర్యంలో విడతలవారీగా 5బ్యాచ్‌లకు 120 మంది ఎస్‌పిఎఫ్ సిబ్బందికి జెమిని రెస్క్యూ పవర్ బోట్ శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాకినాడ ఎస్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్(డిఎస్‌పి) సుధాకరర్,కాకినాడ పోర్టు ఎస్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ వైవి కేశవరాము, జిఎస్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్లు వి.రాము, నారాయణ మరియు ఎస్‌పిఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

### అవినీతిపై సమరం

మబ్బు కమ్మి ఆకాశం నిశీధికి నెలవైంది
దట్టంగా అలుముకున్న అమాసపు చీకట్లు
సమాజ ప్రగతికి ప్రతిబంధకాలౌతుంటే
నిద్రాణమైన వ్యవస్థలో జీవచ్ఛవంగా కాలం వెళ్లబుస్తామా?
లేక చైతన్యపు పాంచజన్యాన్ని పిడికిట పట్టి సమరశంఖారావం చేద్దామా?
యింతలో..
ఆ చీకట్లను చీల్చేందుకు ఓ వృద్ధవరేణ్యుడు
చైతన్య జ్యోతిని చేతపట్టి దిశానిర్దేశం చేస్తున్నాడు
కదలండి ఉపేక్షించక తన అడుగుల్లో అడుగేస్తూ..
అవినీతి చీకట్లను తుదముట్టించేందుకు!
తునాతునకలుగా చేసి అవినీతి భూతాన్ని
ఆనవాళ్లు మిగల్చకుండా భూస్థాపితం చేద్దాం
వేల వెన్నెలల వెలుగుల్లో నవ్య జగతిని నిర్మిద్దాం
పదండి ముందుకు.. పదండి తోసుకు..
వడివడిగా కదం కలుపుదాం..
అవినీతి రహిత సమాజాన్ని స్థాపిద్దాం..

...కవితా రచన
కెవిఎస్.నరసింహం

## పంచాంగం

మాసం : కార్తీక, తిథి : ఏకాదశి, మ. 2.10
ఉత్తర మ. 2.54 వ.రా. 11.24 ల 1.01

మంగళవారం
14-11-2017

**మేషం** : కోర్టు వ్యవహారాలలో ప్లీడర్ల ధోరణి ఆందోళన కలిగిస్తుంది. కాంట్రాక్టర్లు పనివారలవల్ల సమస్యలకు, ఇబ్బందికి లోనవుతారు. చేపట్టిన పనిలో కొంత ముందు వెనుకలుగానైనా సంతృప్తి కానరా గలదు. బంధువుల రాకవల్ల ఊహించని ఖర్చులు పెరుగుతాయి. సహోద్యోగులతో అభిప్రాయ బేధాలు తలెత్తే ఆస్కారం ఉంది,

**వృషభం** : జీవితబీమా, ఫిక్సిడ్ డిపాజిట్లకు సంబంధించిన సొమ్ము చేతి కందుతుంది. వ్యాపారాల్లో ఆటంకాలను అధిగమించటంతో పాటు అను భవం గడిస్తారు. విద్యార్థులకు తోటివారితో సఖ్యత నెలకొంటుంది. దూరప్రయాణాల్లో చికాకులు తప్పవు.

**మిధునం** : వస్త్ర, బంగారం, వెండి రంగాలలో వారికి కలిసిరాగలదు. కంపెనీల ప్రభుత్వ సంస్థలతో లావాదేవీలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహ కరంగా ఉంటుంది. జాగ్రత్త వహించండి. శెనగలు, వక్కలు, కాఫీపొడి, నూనె, ఎండుమిర్చి, చింతపండు వ్యాపారస్తులకు దినదినాభివృద్ధి పొందుతారు. మీ శ్రీమతి సలహా పాటించడం మంచిది.

**కర్కాటకం** : ఉద్యోగ వ్యాపారాల్లో పురోభివృద్ధి సాధిస్తారు. విధినిర్వణలో దొర్లిన తప్పిదాల వల్ల పత్రికా సంస్థలలో వారికి మనస్థిమితం అంతగా ఉండదు. ఫైనాన్సు, చిట్‌ఫండ్ వ్యాపారస్తులకు సంతృప్తి కానరాగలదు. ఉద్యోగంలో శ్రమకు నైపుణ్యతకు మంచి గుర్తింపు లభిస్తుంది. పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి మార్పులు అనుకూలిస్తాయి.

**సింహం** : కాంట్రాక్టర్లకు ఇంజనీరింగ్ అధికారుల నుంచి అభ్యంత రాలెదుర్కోవలసి వస్తుంది. సంగీత కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. కోర్టు వ్యవహారాలు వాయిదాపడటంతో నిరుత్సాహం చెందుతారు. ప్రత్యర్థులపై విజయం సాధిస్తారు. తలపెట్టిన పనులు ఎంతకీ పూర్తికాక విసుగు కలిగిస్తాయి. ఆలయాలను సందర్శిస్తారు.

**కన్య** : ఒక స్థిరాస్తిని అమర్చుకోవాలనే కోరిక స్ఫురిస్తుంది. మీ అలవాట్లు, బలహీనతలు గోప్యంగా ఉంచండి. ఆదాయ వ్యయాల్లో ఏకాగ్రత అవసరం. కుటుంబ, సొత ఖర్చులు అధికంగా ఉంటాయి. కొబ్బరి, పండ్లు, పూలు, కూరగాయల వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆరోగ్య విషయంలో మెళకువ అవసరం.

**తుల** : వృత్తిపరమైన చికాకులను అధిగమిస్తారు. శకునాల ప్రభావం వల్ల కొన్ని వ్యవహారాలు, పనులు వాయిదా వేసుకుంటారు. నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాలకు మంచి స్పందన లభిస్తుంది.

**వృశ్చికం** : బ్యాంకు వ్యవహారాలలోనూ, ప్రయాణాలలోను వస్తువుల పట్ల మెళకువ అవసరం. స్త్రీలకు పనివారలతో చికాకులను ఎదు ర్కుంటారు. చిన్నతరహా పరిశ్రమలలో వారికి అభివృద్ధి కానవస్తుంది.

**ధనుస్సు** : స్త్రీలు పరిచయం లేని వ్యక్తులను దూరంగా ఉంచడం మంచిది. పెద్దల ఆరోగ్యం మెరుగు పడుతుంది.

**మకరం** : బంధువులతో తెగిపోయిన సంబంధాలు తిరిగి బల పడుతాయి. విద్యార్థులకు నూతన పరిచయాలు ఏర్పడుతాయి. ఉపాధ్యా యులతో విద్యార్థులు ఏకీభవించ లేకపోతారు. చేపట్టిన పనులు కొంత ముందు వెనుకలుగానైనా పూర్తి చేస్తారు.

**కుంభం** : వస్త్రాలు, ఆభరణాలు, విలువైన వస్తువులు అమర్చుకోవాలనే స్త్రీల కోరిక నెరవేరుతుంది. మీ లక్ష్య సాధనకు నిరంతర కృషి అవసరం. శత్రువులు మిత్రులుగా మారుతారు.

**మీనం** : ఓర్పు, నేర్పుతో అనుకున్నది సాధిస్తారు. బంధువుల రాక వల్ల గృహంలో కొత్త ఉత్సాహం, సందడి చోటు చేసుకుంటుంది. కుటుంబీకుల మధ్య ఆసక్తిరకమైన విషయాలు చర్చకు వస్తాయి. అనుకున్న పనులు కాస్త ఆలస్యమైనా కంగారు పడకండి.



## దేవుని స్వభావం ఏమిటి?

### సంకీర్తన

పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృ తాం ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే.. సాధువులను అంటే సత్పురుషులను రక్షించడం కోసం.. ఆ విధంగా ధర్మసంస్థాపన చేయడం కోసం నేను ప్రతి యుగంలో ఆవిర్భ విస్తాను. అని భగవానుడు తన అవతార ప్రయోజనాన్ని, స్వభావాన్ని చెప్పుకున్నాడు.

మనం చేసే కర్మలను బట్టి భగవానుడు మనల్ని అను గ్రహిస్తాడు. నిగ్రహిస్తాడు. సాక్షీభూతుడవుతాడు. తన భక్తులపై ఇలా ప్రేమాభిమానాలను ప్రదర్శిస్తాడు. 'ఉదారా స్సర్వ ఏవైతే జానీత్వాత్మైవ వేమతం' నా నుంచి పురుషార్థములు ప్రార్థించి, పొందువారు ఉదారులు. తన నుంచి తీసుకొను వారు ఆయనకు సర్వమును ఇచ్చే వారేనట! ఆశ్రితులు కోరిన ఫలాన్ని వ్వడమే మతం - జ్ఞాని అయిన భక్తుడు తనకు ఆత్మ వంటి వాడట.

ఉపనిషత్తుల్లో ఈ విషయం ఉన్నట్లు లేదే. అంటే, ఉపనిషత్తులలో ఉన్నా, లేకున్నా నాకు లోటు లేదు. ఇది పూర్వ మైన సిద్ధాంతం అని అంటాడు. ఇది భగవంతుని ఔదార్యానికి పరాకాష్ఠ, అయితే ఆయనకు మనం ఏం ఇవ్వగలం? భగవంతుడు అవాప్త సమస్త కాముడు. ఆయనకు లేనిది లేదు. అన్ని కోరికలు తీరిన వాడు. నా సంకల్పం చేతనే నేను అన్నీ సృష్టించుకుంటానంటాడు. ఆయన సౌశీల్యమే భక్తులకు శ్రీరామరక్ష. ఈ విషయమే రామనుజ గీతాభాష్యంలో ఇలా వివరించారు.

'దేవతిర్యక్కుమనుష్య' స్థావరాత్మకంగా ఉన్న ప్రాణుల్లో జాతిని బట్టి, ఆకారాన్ని బట్టి, స్వభావాన్ని బట్టి, జ్ఞానాన్ని బట్టి హెచ్చుతగ్గులున్నా భక్తుల పట్ల, భగవానుడు ఈ తారతమ్యాలను పాటించడు. అందరూ ఆయనకు సమానులే. భక్తుల ప్రేమను, ఆర్తిని మాత్రమే చూసి, కర్మానుగుణంగా వారిని ఆదరించడమే భగవంతుని స్వభావం.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# పొలాలకు వెళ్లకుండా దారి మూసివేశారని ఆర్డీవోకు వినతి



ఆర్డీవో కార్యాలయంకు వచ్చిన రైతులు

నర్సీపట్నం : తమ పొలాలకు వెళ్లకుండా దారి మూసివేశారని చెట్టుపల్లి గ్రామానికి చెందిన రైతులంతా ఆర్డీవో సూర్యారావుకు విన్నవించుకున్నారు. గ్రామం నుండి వీరంతా సోమవారం మూకుమ్మడిగా వచ్చారు. సర్వే నెంబరు 393/1లో 40 సెంట్ల భూమిని సుంకరి బెన్నమ్మ అనే రైతు మరొకరికి అమ్మకం చేసింది. అమ్మేటప్పుడు ఉత్తరం వైపున పొలాల నుంచి నాటు బళ్లు రావడానికి 6 అడుగుల స్థలం ఉంచింది. దీనికి సంబంధించి డాక్యుమెంట్లు ఉన్నాయి. అమ్మకం మొదట కుంపటి సాయి లక్ష్మి అనే గృహిణికి అమ్మకం చేసినట్లు ఆమె తెలిపింది. ఈ దారిని ఇటీవల అక్కడ చెక్కల మిల్లు యాజమాని రాము అక్రమంగా ఆక్రమించుకొని రౌడీలతో గోడ నిర్మించాడని ఆమె ఆర్డీవో ముందు వాపోయారు. ఈ దారి మూసేయడం వల్ల 50 ఎకరాలకు పైబడి పొలానికి సుమారు 30 మంది రైతులు వెళ్లేందుకు ఆటంకం కలిగిందని వారు చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రుత్తల పెదబుజ్జి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివలంక కొండలరావు తదితరులు దగ్గరుండి ఆర్డీవోకు విన్నవించారు.

# గిరిజనేతరులకు నివాస హక్కు

కొయ్యూరు : ఏజెన్సీలో 1/70 చట్టానికి ముందు నుంచి నివసిస్తున్న గిరిజనేతలకు నివాస హక్కు కల్పించాలని గిరిజన సలహా మండలి సమావేశంలో తీర్మానం చేసినట్టు మండల సభ్యురాలు మత్స్యరాస మణికుమారి తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇటీవల 108వ టిఏసి సమావేశంలో అమరావతిలో జరిగిందన్నారు. దశాబ్ధాలుగా కాలంలో మన్యంలో నివసిస్తున్న గిరిజనేతరులకు నివాస హక్కు పత్రాలతో పాటు 1/70 చట్టానికి పూర్వం నుంచి ఉన్న వారి ఆదీనంలో ఉన్న భూములకు పట్టాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ సమావేశంలో చర్చించి తీర్మానం చేశామన్నారు. అలాగే జివో 97ను రద్దు చేయాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపినట్టు చెప్పారు. మత్స్యకారులు, బోయవాల్మీకుల ఎక్కువైనందున ఎస్టీల్లో చేరిస్తే అసలైన గిరిజనులకు అన్యాయం జరుగుతుందనే తలంపుతో వ్యతిరేకించామన్నారు. అలాగే కొండకుమ్మర్లు, బంతు, ఒరియా, కొండరెడ్డి, మాలీలను ఎస్టీ కులంలో చేర్చేందుకు తీర్మానిం మన్నారు. జిసిసిని ప్రభుత్వంలో విలీనం చేసి ఖాళీలు భర్తీ చేయాలని కూడా తీర్మానం చేశామన్నారు. ఐటిడిఎ పాలకవర్గ సమావేశంలో టిఏసి సభ్యులు పాల్గనేలా చూడాలని ప్రభుత్వానికి నివేదించామని ఆమె వివరించారు.

## వాటర్ వర్క్స్ ఎఇగా పెద్దింటి గణేష్

భీమునిపట్నం జోనల్ కార్యాలయంలో తగరపువలస వాటర్ వర్క్స్ ఎ.ఇ పెద్దింటి గణేష్ సోమవారం బాధ్యతలు చేపెట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎమ్.సత్యనారాయణ జోన్ 1 బదిలీపై వెళ్ళారు.




**వీరుమామ విమెన్ ఎంపౌరమెంట్ కార్యక్రమం లో భాగంగా రాయల్ క్వీన్ పేరిట ఒక ఫాషన్ టైలరింగ్ సెంటర్ ను ద్వారాకనగర్లో వీ టీం సంస్థ అధినేత వీరుమామ ప్రారంభించారు. పూర్తి లేటెస్ట్ పరిజ్ఞానం తో రూపొందిన మిషన్స్ తో ప్రారంభించిన ఈ సెంటర్ లో ప్రతి కుట్టు అత్యంత తక్కువ రేట్లకు లభిస్తాయని.ఇందులో ఒక ఫాషన్ డిసైనిర్ మరియు ఇద్దరు లేడీస్ టైలర్ అందుబాటులో ఉంటారని.మరిన్నీ వివరాలకు 0891-6888789 నుమబర్లలో సంప్రదించవొచ్చని తెలిపారు.**

జిల్లాసైన్స్ స్కైర్ పోటీల్లో

## తాణాంస్కూల్‌కు మూడవస్థానం

విద్యార్థులను అభినందిస్తున్న జెడ్పీటీసీ



పరవాడ: జిల్లాసైన్స్ కాంగ్రెస్ పోటీల్లో తాణాం స్కూల్‌కు మూడువ బహుమతి లభించింది. గెలుపొందిన విజేతలైన కె.నాని, కె.కృష్ణప్రసాద్‌లును పరవాడ జిల్లా ప్రాదేశిక సభ్యులు పైల జగన్నాధరావు, ఆహారభద్రత సలహా మండల సభ్యులు పైల సన్యాశిరాజు అభినంధించారు. అనంతరము వాళ్ళు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని బహుమతులు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న

## భజన పోటీలు



భజన పోటీలు జరుగుతున్న దృశ్యం

నాతవరం : మండల కేంద్రంలో మండల స్థాయి భజన పోటీలు కొనసాగుతున్నాయి. ప్రతీ ఏటా కార్తీక మాసంలో స్థానిక రామాలయం వద్ద భజన కార్యక్రమాలు నిర్వహిస్తామని సర్పంచ్ అంకంరెడ్డి పార్వతి, జమీలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది కార్తీక మాసం సందర్భంగా మండల స్థాయి పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పోటీలు 72 గంటలు కొనసాగుతాయన్నారు. పోటీలకు వివిధ గ్రామాల నుంచి సుమారు 36 భజన బృందాలు పాల్గొంటాయని చెప్పారు.

స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్‌లో

# ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



విశాఖపట్నం : చదువుతో పాటు కో కర్రిక్యుర్ ఏక్టివిటీస్ కూడా పాఠశాలలో వుంటే అక్కడ చదువుచున్న పిల్లలందరూ పరిపూర్ణమైన విద్యార్థులు అవుతారని స్కూల్ డైరక్టర్ మళ్ల రాము నాయుడు అన్నారు. ఈ సందర్భంగా సిరిపురం జంక్షన్ దగ్గర, విఐపి రోడ్డులో గల స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ పాఠశాల ఆవరణలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్కూల్ డైరక్టర్ రాము నాయుడు, ముఖ్య అతిధి వేంధర్ యాదవ్ పిల్లలకు బహుమతులను అందజేశారు. గత 25 రోజుల నుండి ప్రతిరోజు విభిన్నమైన పోటీలు నిర్వహిచి వాళ్ళల్లో వున్న ప్రతిభను బయటికు తీస్తున్నామని మళ్ల రామునాయుడు అన్నారు. ఇందులో భాగంగా కరాటే, డాన్సు, జికె, సంగీతములు, నాటిక మొదలైన విభాగాలలో తొమ్మిదిమంది బాల బాలికలకు స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ఆవరణలో 'సూపర్ కిడ్స్-2017' అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా యం.యల్. వేంధర్ యాదవ్, స్కూల్ ప్రిన్సిపల్ మళ్ల వాణిశ్రీ పాల్గొన్నారు. ఒత్తిడితో బ్రతుకుతున్న ఈ రోజుల్లో చదువుతో పాటు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్నందుకు యాదవ్ స్కూల్ యాజమాన్యాన్ని, టీచర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిజమైన వారసులకి ఇనాంభూమిని అప్పగించాలి

అధికారులకు సాలాపు శంకరావు విజ్ఞప్తి




పరవాడ: మండలంలోని తాడి రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 1/3 (సాలాపు వానిపాలెం)లోని పదమూడు ఎకరాల అరవై ఆరుసెంట్లు ఇనాం భూమిపై కలిగి వున్న తప్పుడు డాక్యూ మెంట్లును రద్దుపరిచి నిజమైన వారసులను గుర్తించాలని సాలాపువాని పాలెం గ్రామానికి చెందిన సాలాపుశంకర్ రావు అనే వ్యక్తి విజ్ఞప్తి చేశారు. సోమ వారము అయన విలేఖర్లుతో మాట్లాడారు. ఐతే సమస్యపై ఇటీవల జిల్లా కలెక్టర్, అర్డీఎ, మండల తహ శీల్దారుకు వినతి పత్రాలు సమర్పించామన్నారు. తమ తాత అయిన సాలాపు సన్యాశి పేరున వున్న ఈ భూమికి తానే వారసుడిగా వున్నందున పాసుపుస్తకాల కొరకు రెండు వేలపదిలో కోరడము జరిగిందిన్నారు. ఫలితంగా దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లాకలెక్టరు పరవాడ అధికారు లుకు ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే గజిటెడ్ పబ్లికేషన్ కోసం తహశీల్ధార్ తిరిగి కలెక్టర్ కు లేఖ రాయగా రెండువేల పద్నాలుగులో ఆ భూమిని ఇనాంభూమిగా నిర్ధారిస్తూ జిల్లా రాజసత్రం ద్వారా ప్రకటించారన్నారు.ఆ తర్వాత ఆభూమిపై ఎలాంటి క్రయ విక్రయాలు చేపట్టద్దని స్థానిక తహశీల్ధార్‌కు, సబ్ రిజిస్టార్ కు నోటీసులు పంపించామన్నారు. ఇందులో పాసు పుస్తకాలు కలిగిన తొమ్మిదిమంది పేర్లను రద్దుచేయాలని తాముఅర్డీవో కోర్టులో పిటీషన్ ధాఖలు చేయగా దాని నిమిత్తం విచారణ నోటీ సులు కూడా పంపించారన్నారు. అయితే కొంతమంది రాజకీయ అండదండలుతో అవి రద్దు కాకుండా అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తము చేస్తున్నారు. ఇదే అదునుగా చూసుకొని కొంతమంది అదే గ్రామానికి చెందిన వ్యక్తులు తప్పుడు పత్రాలుసృష్టించి ఆ భూమిని ఇక్కడ కాకుండా యలమంచిలి సబ్ రిజిష్టర్ కార్యాలయంలో గత ఏడాది పదనొ్మదో ఎర్లు మీద రిజిస్ట్రేషన్ చేయంచారని వాపోయారు. ప్రస్తుతము ఆ భూమిలో వారు సరిహద్దు రాళ్ళను ఏర్పాటు చేసి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నస్తు న్నారని ఆవేదన వ్యక్తము చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పధన్మోధి మందికి చెందిన తప్పుడు డాక్యూమెంట్లును రద్దుపరిచి తమకు న్యాయం చేయాలనిశంకర్‌రావు వేడుకున్నారు.

సీలేరు గురుకుల పాఠశాలను

## తనిఖీ చేసిన గురుకులం ఓఎస్‌డి

సీలేరు : సీలేరు బాలురు గిరిజన గురుకుల పాఠశాలను మంగళవారం అమరావతి నుంచి వచ్చిన గురుకులం ఓఎస్‌డి (ఆఫీసర్ ఆఫ్ స్పెషల్ డ్యూటీ) బి.విజయకుమార్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల రికార్డులను లావాదేవీలను సంబంధించిన అకౌంట్లను పరిశీలించారు. ఇక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయులతో సమావేశమై ఇక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలుంటే తెలియజేయాలని అన్నారు.

## నేడు మహిళా కమిషన్ చైర్ పర్శన్ అరకు రాక

కొయ్యూరు : రాష్ట్ర మహిళా కమిషనర్ చైర్ పర్శన్ ఎన్.రాజకుమారి ఈ నెల 14న అరకు రానున్నారు. అత్యాచారానికి గురైన బాలికలను ఈ సందర్భంగా ఆమె పరామర్శిస్తారు. ఇప్పటికే బాధిత బాలికలను కలిసి వారి భవిష్యత్‌పై ఉన్నతాధికారులతో చర్చించామని మహిళా కమిషన్ సభ్యురాలు మణికుమారి తెలిపారు. వారి విద్యకు ఏ విధమైన అవాంతరాలు రాకుడా చూడాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. వారికి పరిహారం, జీవనోపాధి తదితర అంశాలపై చర్చించనున్నట్లు ఆమె తెలిపారు.

## నేటి నుంచి గ్రంధాలయ వారోత్సవాలు

రావికమతం : రావికమతం, కొత్తకోటశాఖా గ్రంధాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకూ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంధపాలకులు జోగేశ్వరి, ఆర్.కన్నబాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. వారం రోజుల్లో పలు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అలరించిన

## బృందగాన నృత్య పోటీలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నర్సీపట్నం : పిఆర్‌టియు ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం బృందగాన నృత్య పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గొలుగొండ, కోటవురట్ల, నాతవరం, రావికమతం, రోలుగుంట, నర్సీపట్నం మండలాలకు చెందిన వివిధ ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిజి.నాధ్ స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు.

## వాలీబాల్ విజేత మామిడివాడ కొత్తూరు


యలమంచిలి రూరల్ : ఏటికొప్పాక బండిమాంబ జాతర సందర్భంగా రెండు రోజులుగా జరుగుతున్న వాలీబాల్ టోర్నీ విజేతగా రాంబిల్లి మండలం మామిడివాడ కొత్తూరు జట్టు నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన ఈ పోటీల్లో ఉత్తరాంధ్ర తూర్పు గోదావరి జిల్లా నుంచి 18 జట్టు పాల్గన్నాయి. ప్రధమ స్థానాన్ని రాంబిల్లి మండలం మామిడివాడ కొత్తూరు, ద్వితీయ స్థానం అనకాపల్లి, తృతీయ బహుమతి రాజమండ్రి, జగ్గంపేట, నాలుగు బహుమతి ఏటికొప్పాక జట్టు గెలుచుకున్నాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

ఇళ్లు, అపార్ట్‌మెంట్, ఇళ్ల స్థలములు కొనాలన్నా, అమ్మాలన్నా, తనఖా, అన్ని రకముల లోన్ సదుపాయములు బ్యాంక్ ద్వారా సమకూర్చుటకు సంప్రదించగలరు.
79815 79817

# మార్చిలోగా మరుగుదొడ్డి నిర్మించే వారికే ప్రోత్సాహక మొత్తం : జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్

**- అన్ని శాఖల్లో అధికారులకు పనితీరు ఆధారంగా గ్రేడింగ్**

**- మరుగుదొడ్లపై వాస్తవ పరిస్థితి కోసం మరో సర్వే : గ్రీవెన్స్‌లో కలెక్టర్**



విజయనగరం : జిల్లాను ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి నెలాఖరుకు బహిరంగ మలవిసర్జన రహితంగా ప్రకటించడం ఖాయమని, ఆ తర్వాత నిర్మించే మరుగుదొడ్లకు ప్రభుత్వం ఇచ్చే పారితోషికం రూ.15 వేలు వాటిని నిర్మించుకొనే వారికి మంజూరు కాదని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ చెప్పారు. జిల్లాలోని మరుగుదొడ్లు లేని కుటుంబాలన్నీ మార్చి నెలాఖరులోగా ప్రభుత్వం అందించే సహాయం రూ.15 వేలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో మరుగుదొడ్డి లేని ఇళ్లన్నింటిలో వాటి నిర్మాణాలను డిశంబరు నెలాఖరులోగా ప్రారంభించాలని జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. జిల్లాలోని కొన్ని పంచాయతీల్లో ఒక్క కుటుంబానికీ మరుగుదొడ్లు లేనట్లుగా గణాంకాలు చెబుతున్నాయని, యీ పరిస్థితిని పూర్తిగా విశ్వసించలేమని, అందువల్ల గ్రామాల్లో క్షేత్రస్థాయిలో వుండే వాస్తవ పరిస్థితులను తెలుసుకొని, జిల్లా యంత్రాంగం వద్ద వున్న సమాచారాన్ని శుద్ధి(ప్యూరిఫికేషన్) చేసేందుకు మంగళవారం నుండి జిల్లాలోని 353 పంచాయతీల్లో యీ సర్వే నిర్వహించనున్నట్టు చెప్పారు. వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించే యీ సర్వే ఒక్కో పంచాయతీలో మూడు రోజులపాటు జరుగుతుందన్నారు. జిల్లాలో ఉద్యమరీతిలో కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ మరింత ముమ్మరంగా మరుగుదొడ్ల నిర్మాణం జరగాల్సి వుందన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. గ్రామాల్లో ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు నివసిస్తున్నట్లయితే అటువంటి వివరాలను సర్వేలో పేర్కొనాలని, గతంలో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమాల సందర్భంగా మంజూరై నిర్మించిన మరుగుదొడ్ల వివరాలను కూడా సర్వే సిబ్బంది సేకరించాలన్నారు.

జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల మండల, డివిజన్ స్థాయి సిబ్బందికి సోమవారం నుండి ఇ-ఆఫీస్‌లో శిక్షణ ఇస్తున్నామని, యీ శిక్షణ కార్యక్రమాలకు అన్ని శాఖల సిబ్బంది హాజరయ్యేలా ఆయా జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. శిక్షణకు హాజరు కాకుండా ఇ-ఆఫీస్‌పై అవగాహన లేదంటే అంగీకరించేది లేదన్నారు.

ప్రభుత్వ శాఖలన్నీ తమ శాఖల్లో పనిచేసే అధికారులందరికీ వారి పనితీరు ఆధారంగా రేటింగ్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్పష్టంచేశారు. ప్రతి శాఖ తమ పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలు, పనుల ఆధారంగా కొన్ని పనితీరు సామర్థ్య సూచికలు ఏర్పరచుకొని వాటి ఆధారంగా అధికారులకు ఏ,బి,సి గ్రేడింగ్ ఇవ్వాలన్నారు. ప్రతి పదిహేను రోజులకోసారి ఈ సమాచారాన్ని ముఖ్య ప్రణాళిక అధికారికి అందజేయాలన్నారు. శాఖల వారీగా అధికారులను ప్రశ్నించి అధికారుల గ్రేడింగ్ చేస్తున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు ఎలాంటి ముందస్తు అనుమతి పొందకుండా పలువురు జిల్లాస్థాయి అధికారులు గైర్హాజరు కావడంపై జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రతి జిల్లా అధికారి గ్రీవెన్స్ మినహా వేరొక కార్యక్రమంలో ససోమవారం పాల్గొనాల్సి వుంటే ముందుగా అనుమతి పొందాలన్నారు. జిల్లా అటవీ అధికారి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్‌లకు బదులుగా ఇతర అధికారులు హాజరు కావడంపై కలెక్టర్ ప్రశ్నించారు. పౌరసరఫరాల జిల్లా మేనేజర్, మార్కెటింగ్ ఏ.డి.ల తరపున హాజరైన కిందిస్థాయి అధికారులు పత్తి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సరైన సమాచారం అందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. విజయవాడలో బోటు ప్రమాదం జరిగిన నేపథ్యంలో జిల్లాలోని తాటిపూడి తదితర రిజర్వాయర్లలో నిర్వహిస్తున్న బోట్లను తక్షణమే నిలిపివేయాలని, తగిన అనుమతులు లభించిన తర్వాతే వాటిని నడపాలని జిల్లా పర్యాటక అధికారిణి అనితను ఆదేశించారు. జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించాలని గతంలో ఆదేశాలు జారీచేశామని, ఎన్ని బంకుల్లో వాటిని నిర్మించారో తెలపాలని జిల్లా సరఫరాల అధికారిని ఆదేశించారు. ఆయన తగిన సమాచారం ఇవ్వలేకపోవడంతో అసంతృప్తి వ్యక్తంచేస్తూ అన్ని పెట్రోలు బంకుల్లో తప్పనిసరిగా మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలని డిఎస్‌ఓను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీకేష్ లత్కర్, జాయింట్ కలెక్టర్-2 కె.నాగేశ్వరరావు, డిఆర్ఓ ఆర్.ఎస్.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**BEFORE THE HONOURABLE EPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT VISAKHAPATNAM.**
**Dispute.No.247 /2017**

**BETWEEN:**
**M/s.Kapil Chits (Kosta)Pvt.Ltd,**
**Gajuwaka Branch,Visakhapatnam ...Disputant**
**AND**
**Sri.A.Venkata Ramana &Others ...Opponents**

**OP2 : Kandregula Mohan Varaha Musile Eswara Durga Rao, S/o. Appa Rao, Hindu, Aged 54 years, R/o.Qtr.No.206/10, Sector-4, Ukkunagaram, Visakhapatnam-32.**
**OP3 : Vasamsetti C andra Sekharam, S/o.Venkateswara Rao, Hindu, Aged 53 years, R/o. D.No.29-17-7, Gollalapalem, Jail Road, Visakhapatnam.**
**OP-4 :Varasala Dhani Raju, S/o.Chinnayya, Hindu, Aged 55 years, R/o.Qtr.No.217/13, Sector-IV, Ukkunagaram, Visakhapatnam.**
**OP-5 :Medidi Ramesh Kumar, S/o.Anjaneyulu, Hindu, Aged 51 years, R/o.Qtr.No.203/C, Sector-8, Ukkunagaram, Visakhapatnam.**

**NOTICE**

Please take notice that the above named Disputant has instituted the above Dispute against for you recovery of Dispute amount with subsequent interest and costs,and the Honourable Court order notice to you through this publication. Hence you are here by Noticed to appear in the above court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above Dispute on **30-11-2017 at 10.30 A.M** in default of your appereance on that day the Dispute will be heard and determined in your absence.

**Adjournment Date :30-11-2017**

**Sri.A.VENKATESWARA RAO,**
**& Sri.P.RATNA KUMARI,**
**ADVOCATES,**
**VISAKHAPATNAM.**

# విశాఖలో జయకేతనమే లక్ష్యం

- అన్ని స్థానాల్లోనూ గెలుస్తాం
- వైసీపీ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు తైనాల
- అమర్ నాథ్ నుంచి బాధ్యతల స్వీకరణ



విశాఖపట్నం- రాబోయే ఎన్నికల్లో విశాఖలో వైసీపీ జయకేతనం ఎగురవేయడం ఖాయమని వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు తైనాల విజయ్ కుమార్ వెల్లడించారు. అన్నిస్థానాల్లో పార్టీ గెలుపొందడం ఖాయమని ఆయన ఉద్ఘాటించారు. జగదాంబ వద్ద గల పార్టీ కార్యాలయంలో సోమవారం ఉదయం ఆయన జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్ నాథ్ నుంచి విశాఖ పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేతలందరితోనూ సమన్వయం చేసుకుని ముందుకు సాగుతామని ప్రకటించారు. విశాఖ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలున్నాయని, ఈ స్థానాల్లో సమన్వయకర్తలతో పాటుగా నాయకులు, కార్యకర్తల సహకారం తీసుకుంటామన్నారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమిష్టి కృషి చేస్తామని తైనాల విజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. విశాఖ జిల్లాలో ఎన్నో సమస్యలున్నాయని, ప్రభుత్వ వాటి పరిష్కారం పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందన్నారు. టీడీపీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజా సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం పట్టించుకోనందునే ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్ర చేపట్టారని గుర్తు చేసారు. జగన్ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. జగన్ ప్రకటించి నవరత్నాలు హామీలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. జగన్ ను సీఎం చేయడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. అంతకుముందు అనకాపల్లి పార్లమెంటరీ పార్టీ ఇన్ చార్జి గుడివాడ అమర్ నాథ్ మాట్లాడుతూ, వైఎస్ జగన్ సారధ్యంలో రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. నేతలందరినీ సమన్వయం చేసుకుని ముందుకు సాగుతామన్నారు. సీనియర్ నాయకులైన తైనాల విజయ్ కుమార్ కు విశాఖ పార్లమెంటరీ పార్టీ బాధ్యతలు, మళ్ల విజయ్ ప్రసాద్ కు విశాఖ నగర బాధ్యతలు అప్పగించడంతో కార్యకర్తల్లో నూతనోత్సాహం వెల్లివిరిస్తోందన్నారు. అంతకుముందు సీనియర్ నేత తిప్పల గురుమూరెడ్డి, గాజువాక సమన్వయకర్త తిప్పల నాగిరెడ్డి, విశాఖ తూర్పు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంశీకృష్ణ శ్రీనివాస్, దక్షిణం నియోజకవర్గ సమన్వయకర్త కోలా గురువులు, భీమిలి నియోజకర్గ ఇన్ చార్జి అక్కరమాని నిర్మల, పెందుర్తి సమన్వయకర్త అదీప్ రాజు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్తలు ఉషాకిరణ్, సత్తి రామకృష్ణారెడ్డి, చంద్రమౌళీ , ఎస్ కోట ఇన్ చార్జి నెక్కల నాయుడు బాబు, తైనాల విజయ్ కుమార్కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తైనాలకు అభినందలు తెలిపిన వారిలో వైసీపీ నేతలు కొయ్యా ప్రసాద రెడ్డి,రవి రెడ్డి, ఫక్కి దివాకర్, ఫరూకీ, రొంగలి జగన్నాథం, జోగునాయుడు, రామన్ పాత్రుడు, గరికిన గౌరీ, పీలా వెంకటలక్ష్మీ,హనోక్ , జాన్ వెస్లీ, శ్రీకాంత్ రాజు, బద్రీనాథ్, మహ్మద్ షరీఫ్ , శివరామకృష్ణ, బయ్యవరపు రాధ, కొండా రాజీవ్, గాంధీ, అళ్ల శివగణేశ్, మూర్తి యాదవ్, విజయ్ చందర్ తదితరులున్నారు.

## రోగికి, వైద్యునికి అనుసంధానకర్త ఫార్మాసిస్టు

- జాతీయ ఫార్మాశిస్టు వారోత్సవాలు ప్రారంభం
- వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు




ఆంధ్ర విశ్వవిద్యాలయం: మాజంలో ఫార్మశిస్తుల పాత్ర కీలకమని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. సోమవారం ఉదయం ఏయూ ఫార్మశీ కళాశాల నిర్వహించిన జాతీయ ఫార్మసిస్ట్ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగికి, వైద్యునికి అనుసంధానకర్తగా ఫార్మశిస్టులు నిలుస్తారన్నారు. రోగికి సత్వర ఉపశమనం అందించడంలో ఫార్మశిస్టులు అందించే సూచనలు ఎంతో కీలకంగా నిలుస్తున్నాయన్నారు. ఏయూలో బిఫార్మశీ, ఎంఫార్మశీ, ఫార్మా డికోర్సులను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని వీసీ నాగేశ్వర రావు ప్రారంభించారు. విద్యార్థులతో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి.గౌరీశంకర్, విజయరత్న, గిరిజా శాస్త్రి, గిరిజా శంకర్, ఈశ్వర్ కుమార్, కె.వి రమణ మూర్తి, మురళీకృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక విప్లవంతోనే అభివృద్ధి

తాళ్లరేవు: బౌద్ధ ఆధ్యాత్మిక, సామాజిక విప్లవంతోనే చైతన్యం వచ్చి సమాజం అబివృద్ధి చెందుతుందని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు గెడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్లరేవు అంబేద్కర్ భవన్‌లో శ్రీరత్నం బౌద్ధ దమ్మ సంఘం ఉపాసకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బౌద్ధానిన కాపాడుకోవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ నెల 19న పశ్చిమ గోదావరి జిల్లా ఉండ్రాజవరంలో ప్రారంభం కానున్న బౌద్ధ దమ్మ పీఠం కార్యక్రమంపై చర్చించారు. అనంతరం బౌద్ధ దమ్మ పీఠం ప్రారంబోత్సవ గోడపత్రాలను ఆయనతోపాటు కార్యదర్శి గుత్తుల శ్రీరాములు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాసకులు పండు బుల్లబ్బాయి, కాశి జానకిరామారావు, అయితాబత్తుల రామేశ్వరరావు, శ్రీరత్న బౌద్ధ దమ్మ సంఘ అధ్యక్షుడు దున్నా సత్యనారాయణ, సాదనాల వెంకటరావు, ప్రసాదబాబు, వడ్డి లక్ష్మి, నాగబత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ సాంకేతిక నిపుణుడిగా వెంకన్న

యానాం: ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ స్పోర్ట్స్ అథారిటీ ఈ నెల 16 నుంచి 20 వరకు గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న 33వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు సాంకేతిక నిపుణుడిగా శారదా విద్యా నికేతన్ వ్యాయామ ఉపాధ్యాయుడు చింతా వెంకన్న ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు చిక్కాల వెంకటేశ్వరరావు తెలిపారు. దేశవ్యాప్తంగా 3 వేల మంది క్రీడాకారులు, 200మంది టెక్నికల్ అధికారులు హాజరౌతారని పుదుచ్చేరి నుంచి పోటీల నిర్వహణలో వెంకన్నకు ఒక్కరికే పాల్గొనే అవకాశం లభించిందని చిక్కాల తెలిపారు. ఆయనకు పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు, పరిపాలనాధికారి దవుళూరి సుబ్రహ్మణ్యేశ్వరరావులు అభినందనలు తెలిపారు.

## పోటీలో పాల్గొనేందుకు అనుమతి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా క్రీడాకారులు జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో ఫెడరేషన్ ద్వారా పోటీలో పాల్గొనడానికి జాతీయ అథ్లెటిక్ ఫెడరేషన్ తాజాగా అనుమతి ఇచ్చింది. యానాం క్రీడాకారిణి వాత్సవాయి ఉమామహేశ్వరి గుంటూరులో జరగనున్న 33వ జాతీయ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలో పాల్గొనడానికి పుదుచ్చేరి క్రీడాకారులకు అనుమతి లేకపోవడంతో తాను అవకాశాన్ని కోల్పోవలసి వస్తుందని ఫెడరేషన్‌కు విజ్ఞప్తి చేసింది. జాతీయ ఫెడరేషన్ ద్వారా పుదుచ్చేరికి చెందిన 44 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనవచ్చంటూ యానాంకు సమాచారం వచ్చింది. కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుని అసోసియేషన్ గుర్తింపును తిరిగి పొందాలని ఫెడరేషన్ కోరినట్లు కోచ్ చింతా వెంకన్న తెలిపారు.

## బాలశ్రీ పురస్కారానికి ప్రణీతి ఎంపిక

యానాం: అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పుదుచ్చేరిలోని జవహర్ బాలభవన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలశ్రీ పోటీలలో పెమ్మాడ పద్మ ప్రణీతి(9వ తరగతి) పురస్కారానికి ఎంపికైనట్లు విద్యా శాఖ అధికారి కాలే సాయినాధ్, శారదా విద్యా నికేతన్ ప్రధానోపాధ్యాయుడు చిక్కాల వెంకటేశ్వరరావు తెలిపారు.

గత వారం పుదుచ్చేరిలో జరిగిన రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి దక్షిణ భారత ప్రదర్శనకు ఎంపికైంది. సృజనాత్మక రచనా విభాగంలో ప్రతిభ కనబరిచింది. ముఖ్యమంత్రి వి. నారాయణసామి చేతుల మీదుగా ఈ నెల 14న పురస్కారాన్ని స్వీకరించడానికి గైడ్ టీచర్ ఆలీషాతో కలిసి పుదుచ్చేరి బయలుదేరి వెళ్లినట్లు తెలిపారు.

## కౌమార దశ బాలికలకు ఆత్మరక్షణ కొరకు కరాటే శిక్షణా కార్యక్రమం ప్రారంభం



ఆలమూరు :- స్థానిక బొబ్బా జయశ్రీ బాలికల హైస్కూల్, కొత్తూరు సెంటర్‌లోని ప్రభుత్వ హైస్కూల్ నందు కౌమారదశ బాలికల ఆత్మరక్షణ కొరకు సోమవారం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ (బీమా) సంస్థ వారు శనివారం శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా బండి మార్షల్ ఆర్ట్స్ కో-ఆర్డినేటర్ టి.అబ్బులు మాట్లాడుతూ జిల్లా పరిధిలో 486 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నందు కౌమారదశ బాలికలకు ఆత్మరక్షణ కొరకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టార్ టి.వెంకటలక్ష్మి, గర్ల్స్ హైస్కూల్ హెచ్.ఎమ్. పి.వెంకటలక్ష్మి, ప్రభుత్వ హైస్కూల్ హెచ్.ఎమ్. జి.రామలక్ష్మణరావు, గంగారావు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దుపై నల్ల బ్యాడ్జీలతో విధుల నిర్వహణ



ఆలమూరు :- నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేస్తూ అసెంబ్లీ సీతాకాల సమావేశాలలో తీర్మానించి, కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేస్తూ ఎ.పి.సి.పి.ఎస్. ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్ వద్ద ఆదివారం నుండి 48 గంటల పాటు చేపట్టిన నిరవదిక నిరాహార దీక్షకు మద్దుతుగా సోమవారం ఆలమూరులో పలుశాఖలలోని పలువురు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ యమున, విఆర్వోల సంఘ ప్రతినిధి అమ్మాజీలు మాట్లాడుతూ తన జీవితంలో 30 సం॥లకు పైగా సేవలందించి, వృద్ధాప్యంలో సామాజిక భద్రత పెన్షన్ పొందటం ప్రభుత్వ ఉద్యోగి హక్కు అని వారు అన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం 2004లో సిపిఎస్ విధానాన్ని తీసకువచ్చిందన్నారు. దీంతో ఉద్యోగులకు రిటైర్‌మెంట్ తర్వాత కనీస పెన్షన్ గ్యారంటీ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో విఆర్వోలు టి.వెంకటేశ్వరరావు, రాంపండు, అప్పలకొండ, అరుణకుమారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న వేషధారణలో చిన్నారులు




కాకినాడ: బాలల దినోత్సవంను పురస్కరించుకుని నిర్వహించిన విభిన్న వేషధారణ(ఫ్యాన్సీ డ్రెస్) పోటీలలో చిన్నారులు పాల్గొని ఆకట్టుకున్నారు. స్థానిక తిలక్‌స్ట్రీట్‌లోని సాధన హైస్కూలులో బాలల దినోత్సవం వేడుకల్లో భాగంగా చిన్నారులకు విభిన్న వేషధారణ పోటీలు నిర్వహించారు.

ఈ పోటీలలో ఒకటో తరగతి నుంచి ఆరో తరగతి వరకు చదివే బాలబాలికలు అల్లూరి సీతారామరాజు, శ్రీకృష్ణుడు, గోపికలు, భారతమాత, రుద్రమదేవి, ఉపాధ్యాయ, వైద్యులు, మదర్‌థెరిస్సా, కేరళ, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన వస్త్రధారణరీతులు తదితర విభిన్న వేషాలు ధరించి అమితంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా స్కూలు కరస్పాండెంట్ మాధవరావు మాట్లాడుతూ పిల్లల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికితీయడానికి ఇటువంటి వేషధారణలు దోహదం చేస్తాయన్నారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు వివిధ క్రీడలను నిర్వహించామనీ, విజేతలకు మంగళవారం నిర్వహించే బాలల దినోత్సవం కార్యక్రమంలో బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

## వ్యభిచార నిర్వాహకుల గుట్టురట్టు

పెదపూడి: కాకినాడ రూరల్ చీడిగ గ్రామ పంచాయతీ పరిధిలో గల కల్యాణ మండపం సమీపంలో గల గృహమునందు వ్యభిచార వృత్తికి బానిసగా మారి విటులను ఆకర్షిస్తూ వ్యబిచార0 చేస్తున్న ఇద్దరు వ్యక్తులు మరియు విటులను ఆదివారం కాకినాడ రూరల్ సర్కిల్ ఇంచార్జె ఇన్స్పెక్టర్ బి రాజశేఖర్ నేతృత్వంలో అరెస్టు చేశారు.

## మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కమిషనర్ శివపార్వతి



కాకినాడ: కాకినాడ నగర మేయర్ సుంకర పావనిని సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.శివపార్వతి సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శివపార్వతి కాకినాడ ప్రథమ పౌరురాలు, నగర మేయర్ సుంకర పావనిని కలిశారు. కమిషనర్ వెంట నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు, ఉప కమిషనర్ కె.రమేష్, సూపరింటెండెంట్ ఇంజనీర్ సిహెచ్ విజయకుమార్ తదితరులు ఉన్నారు. అనంతరం కమిషనర్ శివపార్వతి నగరపాలక సంస్థలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఏక రూప దుస్తులు పంపిణీ

పెదపూడి: అనపర్తి మండలంలోని పోలమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏక రూప దుస్తులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం సభ్యులు దేవాధాన రెడ్డి జన్మభూమి కమిటి సభ్యులు పాల్గొని విద్యార్థులు కు చదువుకోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి మాట్లాడుతూ విద్యార్థులకు ఏక రూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాద్యాయులు పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

## నేటి నుండి గ్రంథాలయ వారోత్సవాలు

అమలాపురం: ఈ నెల 14 నుండి అమలాపురం జిల్లా శాఖ గ్రంథాలయంలో 50వ స్వర్ణోత్సవాలను, గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రేడ్-1 అధికారి జి.వి.ఆర్.వర్మ తెలిపారు. బాలల దినోత్సవాన్ని, 15న కార్యాలయంలో పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుకొనుట, 17న కవిసమ్మేళనం, 18న విద్యార్థులకు పోటీలు, 19వ తేదీన మహిళా దినోత్సవం, 21న అక్షరాస్యత దినోత్సవం ఇలా వారం రోజుల పాటు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేయనున్నట్లు వర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

## కృష్ణా నదికి హారతి రద్దు: ఈవో

విజయవాడ: కృష్ణా నదిలో పడవ ప్రమాదం నేపథ్యంలో ఫెర్రీ ఘాట్ వద్ద హారతి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు దుర్గగుడి ఈవో సూర్యకుమారి తెలిపారు.

## 5 లక్షల 50 వేల టన్నుల లక్ష్యంగా

# గోవాడ షుగర్సు ప్రారంభం

### లాంఛనంగా నేడు ప్రారంభం, ఖరారు కాని రెగ్యులరు క్రషింగు



చోడవరం: గోవాడ షుగర్సులో 2017-18 క్రషింగు సీజనుకుగాను 5 లక్షల 50 వేల టన్నుల చెరకు గానుగాట లక్ష్యంగా ఫ్యాక్టరీ ఎం.డి. కె.ఆరు.విక్టరు రాజు, ఛైర్మను గూనూరు మల్లునాయుడులు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.డి., ఛైర్మన్లు విలేఖరులతో మాట్లాడుతూ గతేడాది క్రషింగుకు సీజనుకు సంబంధించి కార్మికులకు, సభ్య రైతులకు ఎటువంటి బకాయిలు లేవన్నారు. బహిరంగ మార్కెట్లో పంచదార ధర ఆశజనకంగా ఉండటంతో గతంలో ఫ్యాక్టరీ చేసిన అప్పులు, వడ్డీలు తీరిపోగా రూ.26 కోట్లు నిఖర లాభం వచ్చిందన్నారు. గతేడాది ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2300లకు అమ్మకపు పన్ను రూ.60లు మరియు మహాజన సభలో ఆమోదించిన ఇన్సెంటివు రూ.90లుతో గేటు ఏరియాకు తోలకపు ఖర్చులు రూ.50లతో కలిపి చెరకు టన్నుకు మద్దతు ధర రూ.2640లు చెల్లించినట్లు తెలిపారు. ఈ యేడాది ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర టన్నుకు రూ.2550లు అని తెలియజేసారు. రెగ్యులరు క్రషింగు ప్రారంభం నుండి నవంబరు, డిశెంబరు నెలల్లో సభ్య రైతులు కనీసం రెండు టన్నులకు మించి చెరకు సరఫరా చేయాలన్నారు. వీటికి జనవరిలో తొలివిడత పేమెంట్లలో టన్నుకు రూ.2500లు చెల్లిస్తామన్నారు. గతేడాది గోవాడ షుగర్సు పరిధిలో 1526 హెక్టార్లలో చెరకు సాగయ్యేదని, ఈ యేడాది కూడా చెరకు విస్తీర్ణం తగ్గినప్పటికి చెరకు సాగు ఆశాజనకంగానే ఉన్నట్లు తెలిపారు. సభ్యరైతలు ఇతర జిల్లాలకు చెందిన ప్రైవేటు ఫ్యాక్టరీలకు చెరకు సరఫరా చేయరాదని, దీని వలన ఫ్యాక్టరీ మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందని తెలియజేసారు. లక్షలాది కుటుంబాలు ఆధారపడ్డ గోవాడ షుగర్సును రక్షించుకోవలసిన బాధ్యత కార్మికులు, రైతాంగానిదేనని తెలిపారు. ఇతర ఫ్యాక్టరీలకు చెరకు తరలిపోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్తు ఆదాకు ఈ యేడాది రెండు టర్బైన్లు సింకనైజు చేసామని, చెరకు అనులోడింగుకు కొత్త క్రేను కొనుగోలు చేసామని తెలిపారు. ప్రభుత్వం సహకరిస్తే డిష్టలరీల ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ పాలకమండలి సభ్యులు, కేను అభివృద్ది అధికారి (సి.డి.ఒ) మల్లిఖార్జున రెడ్డి, కార్మిక సంఘ నాయకుడు శరగడం రామునాయుడు, అధికారులు, ఫీల్డు సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# అలాంటి కోరికలు లేవు

పదకొండేళ్ల సినీ ప్రయాణం ఎన్నో మధురానుభూతులను మిగిల్చిందని చెబుతున్నది గోవా సొగసరి ఇలియానా. ఇన్నేళ్లలో అసంత ృప్తికి గురైన సందర్భం ఒక్కటి లేదని అంటున్నది. టాలీవుడ్‌కు దూరంగా ఉంటున్న ఈ సుందరి గత కొన్నేళ్లుగా బాలీవుడ్ సినిమాలపై ద ృష్టిసారిస్తున్నది. నవతరం తారలతో గట్టిపోటీని ఎదుర్కొంటున్న ఈ భామ రేసులో వెనుకబడిపోతున్నది. ఏడాదికి ఒక సినిమా మాత్రమే చేస్తున్నది. అయితే ఇలియానా మాత్రం తనకు ఎవరూ పోటీలేరని, తానెవరికి పోటీ కాదని చెబుతున్నది. ఆమె మాట్లాడుతూ సుదీర్ఘ సినీ ప్రయాణంలో అగ్రనటినవ్వాలని, నంబర్‌వన్ స్థానానికి చేరుకోవాలనే లక్ష్యాలను ఏనాడు విధించుకోలేదు. అలాంటి కోరికలు నాకు లేవు. చిత్రసీమలో నాకు పోటీ ఎవరూ లేరు. మరొకరి అవకాశాల్ని సొంతం చేసుకోవాలని ఎప్పుడు ఆలోచించను. అలాంటి ప్రయత్నాలు ఎప్పుడు చేయను. కథానాయికల మధ్య పోటీవల్లే నాకు అవకాశాలు తగ్గాయనడం అవాస్తవం. ఇక్కడ ఎవరి అవకాశాలు వారికి ఉంటాయి. ఫలానా పాత్ర నేను చేయాలని రాసిపెట్టుంటే ఎలాంటి అవరోధాల్ని అయినా దాటుకొని ఆ పాత్ర మనల్నే వెతుక్కుంటూ వస్తుందన్నది నా నమ్మకం. ప్రస్తుతం కెరీర్ పరంగా సంతోషంగా ఉన్నాను. ఏది పడితే అది కాకుండా ఆలస్యమైనా మంచి సినిమా చేయాలన్నదే నా అభిమతం. అందుకే సినిమాల మధ్య గ్యాప్ ఎక్కువగా వస్తుంది అని చెప్పింది. ప్రస్తుతం ఇలియానా హిందీలో రైడ్ సినిమాలో నటిస్తున్నది.



## చిత్రభాను

# హైపర్ ఆదిపై నిప్పులు చెరిగిన: మహేష్ కత్తి



హైపర్ ఆదిపై ఫైర్ అయిన మహేష్ కత్తి జనాలు తిట్టుకుంటూ కూడా చూసే కామెడీ షో జబదస్థ్, ఈ మధ్యకాలంలో వచ్చిన రియాలిటీషోలన్నిటికీ ఇన్స్పిరేషన్ ఇదే అనటం లో సందేహం లేదు... అయితే ఈ షో మొదలైన దగ్గరినుంచీ రకరకాల వివాదాల్లో ఉన్న ఈ షో ఇంకా అదేరకంగా సాగుతూనేఉంది. ఆడవాళ్లని కించపరుస్తున్నారనే ఆరోపణలు మొదలు కులవివక్ష, కోర్టునే అపహాస్యం చేయటం లాంటి ఆరోపణలతో కేసులని కూడా ఎదుర్కుందీ షో... ఈ షో లో హైపర్ ఆది చేసే స్కిట్ లకి కాస్త ఫాలోయింగ్ ఎక్కువే, దాదాపు వాట్సాప్, ఫేస్బుక్లలో వచ్చే జోకులనే కాపీకొట్టి "పంచ్" లుగా వాడే ఆదీ స్కిట్స్లో గతం లోనే రామ్‌గోపాల్ వర్మ మీద కూడా సెటైర్లు వేసాడు... రాత్రి బోరుకొడితే ఓడ్కా బాటిల్ ఓపెన్ చేసి ట్విట్టర్ ఓపెన్ చేస్తాడంటూ ఇన్‌డైరెక్ట్ గా రామ్‌గోపాల్ వర్మ మీద వేసిన సెటైర్లకే ఆది మీద కొంత వ్యతిరేకత వచ్చింది జనాల్లో. మెగా ఫ్యామిలీకి ఎవరు ఆపోజిట్ లో ఉన్నా వాళ్ళే హైపర్ ఆది స్కిట్లో నెక్స్ట్ టార్గెట్. ఈ మధ్య పవన్ కళ్యాణ్ కాంట్రవర్సీ దగ్గర్నుంచీ మహేష్ కత్తి ఎదుర్కుంటున్న సమస్యలు మనందరికీ తెలిసినవే అదే సమయం లో హైపర్ ఆది కూడా మహేష్ కత్తిని టార్గెట్ చేస్తూ ఒక స్కిట్ వేసాడు.

ఈ పంచ్ లు తనను ఉద్దేశించి ఉన్నాయంటూ కనెక్ట్ అయ్యాడ కత్తి. తనకు పొట్ట ఉందని.. బట్ట ఉందని.. మనుషులంతా ఒక్కటేలా ఉంటారా? అంటూ క్వశ్చన్ వేయటమే కాదు.. ఒక్కొక్కరు ఒక్కోలా ఉంటారని.. ఆ ఒక్కొక్కరు ఒక్కో రకంగా ఉండటమే ప్రపంచమన్నారు. కాస్త భిన్నంగా ఉంటేనే జోర్స్ అయిపోతామా? అంటూ రియాక్ట్ అయిన మహేశ్.. ఒకరు పొడుగ్గా ఉండొచ్చని.. మరొకరు పొట్టిగా ఉండొచ్చని.. నా స్టైల్లో నేను ఉంటానని.. అంత మాత్రానికే అలా అనేస్తారా? అంటూ సోషల్ మీడియా లైవ్ ద్వారా హైపర్ ఆదిని ఏసుకున్నాడు. తాను జబర్దస్త్ షోను చూడనని.. కాకుంటే ఫ్రెండ్స్ పంపే లింక్స్ చూడటంతోనే తనకీ విషయాలు తెలిశాయన్నారు. జబర్దస్త్ గొప్ప షో అయినా.. అందులో గొప్ప కామెడీ ఉంటుందని తాను అనుకోననీ. మనుషుల మీదా..వారు వేసుకునే బట్టల మీద కామెడీ చేస్తూ అపహాస్యం చేస్తున్న దానిని హాస్యంగా ఎంజాయ్ చేస్తున్నారంటూ మండిపడ్డాడు. ఫేస్‌బుక్ లైవ్ సందర్భంగా కత్తి మహేశ్ బదులిస్తూ.. పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ సైలెంట్‌గా ఉండటమే అతడికి మంచిదని సలహా ఇచ్చాడు. నేను ఇలా ఉండేందుకే ఇష్టపడతా. నా పొట్ట, నా బట్ట నాకు నిజంగా గర్వకారణం అని చెప్పాడు.



## రేణు దేశాయ్ రెండోపెళ్లి..!



పవన్ కళ్యాణ్ మాజీ భార్య, నటి, దర్శకురాలు తాజాగా ఆర్కే ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ ఇంటర్వ్యూలో ఆర్కే ఆమె పర్సనల్ లైఫ్, ప్రొఫెషనల్ లైఫ్‌కి సంబంధించి పలు ఆసక్తికర విషయాలను రాబట్టే ప్రయత్నం చేశారు. తన మోడలింగ్ డేస్, పవన్ కళ్యాణ్‌తో ప్రేమాయణం, విడాకుల తర్వాత తాను ఎదుర్కొన్న పరిస్థితులు ఇలా చాలా విషయాలు రేణు దేశాయ్ చెప్పుకొచ్చారు. మోడలింగ్ మొదలు పెట్టినపుడు నాకు నా మీద నమ్మకం లేదు. ఒక అబ్బాయి కూడా నా వైపు చూడటం లేదు నేను మోడల్ ఎలా అయ్యాను అనే ఫీలింగ్ ఉండేదు.... అని రేణు దేశాయ్ తెలిపారు. మోడలింగ్ మొదలు పెట్టినపుడు నాకు నా మీద నమ్మకం లేదు. ఒక అబ్బాయి కూడా నా వైపు చూడటం లేదు నేను మోడల్ ఎలా అయ్యాను అనే ఫీలింగ్ ఉండేదు.... అని రేణు దేశాయ్ తెలిపారు. మోడలింగ్‌లో ఉన్నపుడూ ఎవరూ ప్రపోజ్ చేయలేదు. కళ్యాణ్ గారిని చూడగానే తొలిచూపులోనే ప్రేమలో పడిపోయాను. ఇద్దరం అపుడు ఒకరినొకరం బాగా ఇష్టపడ్డామని రేణు దేశాయ్ తెలిపారు. ట్రెడిషనల్ ఫ్యామిలీ నుండి వచ్చాను. సహజీవనం అంటే తొలుత చాలా భయం వేసింది. కానీ నాకు పవన్ కళ్యాణ్ గారి మీద చాలా నమ్మకం ఉండటం వల్లే ఆభయం పోయింది. అందువల్లే లివింగ్ టుగెదర్ సాధ్యమైంది... అని రేణు దేశాయ్ తెలిపారు. డైవర్స్ తీసుకున్న వారు ఒకరిపై ఒకరు చాలా కోపంగా ఉంటారు. ఒకరితో ఒకరు మాట్లాడుకోక పోవడం లాంటి వి ఉంటాయి. కానీ మా మధ్య అలాంటివి ఏమీ లేదు. ఇద్దరం ఇప్పటికీ మంచి స్నేహితులుగా ఉంటాం. కొన్ని కారణాల వల్ల విడాకులు జరిగాయి.... అని రేణు దేశాయ్ తెలిపారు.

# అనుష్క ప్రేమాయణం...!

ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అనుష్క అతడికి ఓ ప్రత్యేకమైన బహుమతిని అందజేసినట్లు తెలిసింది. ఆ బహుమతి ఏమిటనేది ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. తెలుగు చిత్రసీమలో హిట్‌పెయిర్‌గా గుర్తింపు సొంతం చేసుకున్నారు ప్రభాస్, అనుష్క. వీరిద్దరి కలయికలో రూపొందిన బిల్లా, మిర్చి, బాహుబలి చిత్రాలు మంచి విజయాల్ని సొంతం చేసుకున్నాయి. తొలి సినిమా నుంచి వీరిద్దరి మధ్య చక్కటి స్నేహసంబంధాలు కొనసాగుతున్నాయి. ఒకానొకదశలో వీరిద్దరి ప్రేమలో పడినట్లు, పెళ్లిచేసుకోబోతున్నట్లు పుకార్లు షికారు చేశాయి. ఈ పెళ్లి వార్తలను ఖండించిన ప్రభాస్ తమ మధ్య స్నేహం మాత్రమే వుందని సన్నిహితుల ద్వారా వెల్లడించారు. తాజాగా ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అనుష్క స్పెషల్ డిజైనర్ వాచ్‌ను బహుమతిగా అందజేసినట్లు తెలిసింది. ప్రభాస్‌కు వాచీలంటే ఇష్టమట. స్నేహితుడి ఇష్టాన్ని గ్రహించిన అనుష్క ప్రత్యేకంగా సిద్ధంచేసిన గడియారాన్ని బహుమానంగా అందజేసినట్లు సమాచారం.





సినిమా ఎంత బాగా తీసామన్నది కాదు ఎంతబాగా ప్రమోట్ చేసామన్నది అంతకంటే ఇంపార్టెంట్., నిజానికి సినిమా తీయటం ఒక ఎత్తయితే దాన్ని సరైన విధంగా పబ్లిసిటీ చేసుకోవటం అంతకంటే పెద్ద టాస్క్. సరైన విధంగా పబ్లిసిటీ లేక థియేటర్ దగ్గర కళ్ళు తేళ్లేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అయితే ప్రమోషన్ అన్నది ఎప్పుడూ ఒక పోస్టర్, టీజర్, ట్రైలర్ ఇలా ఆగిపోతే ఎలా? అందుకే కొత్త పద్ధతిలో ట్రై చేసారు "లండన్ బాబులు".

ఇంతకు ముందులాగా రోజుల తరబడి సినిమా థియేటర్లో ఉండే పరిస్థితి లేదు కాబట్టి వారం తిరిగేలోపు కలెక్షన్లు రాబట్టుకోవాలి, మొదటి మూడు రోజుల్లోనే పెట్టిన పెట్టుబడి వెనక్కి వచ్చేయాలి. అలాటి సమయం లో లండన్ బాబులు టీమ్

# ద్యావుడా..! యాడ్ స్పూఫ్‌తో



ప్రయోగం పిచ్చి పిచ్చిగా నవ్విస్తోంది... కొంచం హ్యూమర్, ఇంకొంచం క్రియేటివిటీ కలుపుకొని చేసిన ఈ యాడ్ చూడండి.. నవ్వి నవ్వీ పొట్ట చేత్తో పట్టుకుంటారు... ఈ మధ్య టీవీ చానెల్స్‌లో అదరగొడుతున్న లలితా జ్యూయలర్స్ యాడ్ ఎంత సంచలనం అయిందో తెలిసిందే. ఆ యాడ్‌లో ఏకంగా లలిత జ్యూయలర్స్ యాజమాని అయిన కిరణ్ వచ్చి మార్కెట్‌లో అంటూ.. బంగారం విలువ గురించి లలిత జ్యూయలర్స్ గురించి చెప్తూ బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. ఆయన చేస్తున్న ప్రమోషన్ హాట్ టాపిక్ అవ్వడమే కాకుండా లలిత జ్యూయలర్స్ సేల్స్ పెరగడానికి కూడా కారణం అవుతోంది. ఇప్పుడిదే సూఫ్‌తో లండన్ బాబులు టీమ్ ప్రమోషన్‌కి దిగింది. ఈ సూఫ్ వీడియోలు నెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ఇక వీడియోలో ఉన్న మ్యాటర్ విషయానికి వస్తే.. "ప్రతి శుక్రవారం ఎన్నో సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. ఆ సినిమా కెళదామా? ఈ సినిమా కెళదామా? అని కన్ఫ్యూజ్ అవుతున్నారా? మీ దగ్గర ఉన్న మొబైల్‌లో మా లండన్ బాబులు ట్రైలర్ చూడండి. మా ట్రైలర్ పెట్టుకుని మిగతా నాలుగైదు సినిమాల ట్రైలర్స్‌తో కంపేర్ చేయండి.

## బోటు ప్రమాదంపై

# ప్రధాని మోదీ ట్వీట్



న్యూఢిల్లీ: ప్రయాణీకులను బలితీసుకున్న కృష్ణానది బోటు ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఫిలిప్పిన్స్ పర్యటనలో ఉన్న ఆయన.. విజయవాడలో జరిగిన ఘోర ప్రమాదంపై ట్విటర్లో స్పందించారు. ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కృష్ణానదిలో బోటు తిరగబడిన ఘటన తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ఈ ప్రమాదంలో ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు. బాధితులకు సాయంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి... అని ప్రధాని ట్వీట్ చేశారు. కాగా ఈ ప్రమాదంలో ఇప్పటివరకు మొత్తం 17 మృతదేహాలను వెలికితీసినట్లు కృష్ణాజిల్లా కలెక్టర్ బి. లక్ష్మీకాంతం వెల్లడించారు.

గల్లంతైన మిగతావారి కోసం తీవ్రంగా గాలింపు కొనసాగిస్తున్నామని తెలిపారు. దీనిపై విచారణ జరిపేందుకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసిందన్నారు. ఈ ఘటనపై పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారనీ.. అందులో ఇప్పటికే ఒకరిని అరెస్టు చేశారని తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు బోటులో మొత్తం 41 మంది ప్రయాణిస్తుండగా.. అందులో అత్యధికంగా ఒంగోలు నుంచి పిక్నిక్కోసం వచ్చిన వారే 32 మంది వరకు ఉన్నారు.

# సమరానికి సై..

## కోల్‌కతా చేరుకున్న టీమిండియా



కోల్‌కతా: భారత్-శ్రీలంక మధ్య ఈనెల 16న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో తొలి టెస్ట్ జరగనుంది. ఇందుకోసం భారత జట్టులోని 8 మంది ఆటగాళ్లు ఆదివారం రాత్రే నగరానికి చేరుకున్నారు. కోచ్ రవిశాస్త్రి, ఆటగాళ్లు ఉమేశ్ యాదవ్, శిఖర్ ధవన్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, రోహిత్ శర్మ, రహానే తదితరులు కోల్‌కతా చేరుకోగా కెప్టెన్ కోహ్లీ సహా మిగతా ఆటగాళ్లు నేడు రానున్నారు. హార్థిక్ పాండ్యాకు విశ్రాంతి పేరుతో ఈ సిరీస్ నుంచి పక్కన పెట్టారు. బోర్డు ఎలెవన్‌తో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌ను శ్రీలంక డ్రా చేసుకుంది. స్వదేశంలో భారత్‌తో స్వదేశంలో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను భారత్ క్లీన్ స్వీప్ చేయడంతో శ్రీలంక ప్రతీకారంతో రగిలిపోతోంది. భారత్‌ను స్వదేశంలోనే ఓడించి పరువు దక్కించుకోవాలని కసిగా ఉంది.

# నేటి బాలలే రేపటి పౌరులు



అందరూ అనుభవించే బాల్యం.. భగవంతుడు ఇచ్చిన ఓ అమూల్యమైన వరం. అభం శుభం తెలియని ఆ పసి మనసులు పూతోటలో అప్పుడే పరిమళించిన పువ్వులు. అందుకు సూచకంగా ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాలలో బాలల దినోత్సవాలు జరుపుకుంటారు. అలాగే మనదేశంలోనూ బాలల దినోత్సవం జరుపుకుంటారు. మన దేశంలో ప్రతి సంవత్సరం నవంబరు 14 న బాలల దినోత్సవం జరుపుకుంటాము. భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం రోజున ఈ ఉత్సవం జరుగుతుంది. నెహ్రూకు పిల్లలతో వున్న బాంధవ్యాన్ని తెలుపుతూ ఈ ఉత్సవం జరుపుకుంటారు. పిల్లలు నెహ్రూను చాచా నెహ్రూ అని ప్రేమగా పిలిచేవారు. భారత తపాలా శాఖ ప్రతి సంవత్సరం ఈ రోజు తపాలా బిళ్ళను విడుదల చేస్తుంది.

భారత దేశాన్ని దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి పథంలో నడిపించిన సమర్థత జవహర్‌లాల్ నెహ్రూ సొంతం.

స్వాతంత్ర్యం కోసం బ్రిటిషువారితో పోరాటం చేసేటప్పుడు మహాత్మా గాంధీకి ఈయన ప్రథమ శిష్యుడిగా ఉండేవారు. స్వాతంత్యం సంపాదించిన తరువాత భారతదేశానికి మొట్టమొదటి ప్రధానమంత్రిగా పనిజేశారు. అందుకే నెహ్రూని జాతి అంతా గుర్తించి గౌరవిస్తోంది. అయితే ప్రత్యేకంగా ఆయన పుట్టినరోజునాడే బాలల దినోత్సవం జరుపుకోవడానికి ఒక కారణం ఉంది. అదేంటంటే... నెహ్రూకి పిల్లలంటే చాలా ఇష్టం. అయితే ఆయన జీవితంలో ఎక్కువభాగం జైళ్ళలో గడపవలసి రావడంతో ఏకైక కూతురు ఇందిరా ప్రియదర్శినితో ఆయన ఎక్కువ కాలం



గడపలేకపోయారు. కానీ దేశంలోని బిడ్డలందర్నీ కన్నబిడ్డలుగా ప్రేమించే స్వభావం నెహ్రూది. పిల్లలతో ఉన్నప్పుడు మనసు హాయిగా ఉంటుంది.

నాకు ఏ పవిత్రస్థలంలోనూ కూడా అంతటి శాంతి, సంతృప్తి లభించవు అని నెహ్రూ అనేవారు. పిల్లలను జాతి సంపదగా భావించి అందరూ వారి భవితవ్యానికి కృషి చేయాలని నెహ్రూ తరచూ చెప్పేవారు. ఆయన పాలనాకాలంలో దేశంలో బాలల అభివృద్ధికి ఎంతో కృషి జరిగింది. అందుకే ఆయ

పుట్టిన రోజు నాడు మనదేశంలో బాలలంతా పండగ చేసుకుంటారు. సాంస్కృతి కోత్సవాలు నిర్వహించుకొని చాచా నెహ్రూను బాలలు ప్రేమగా స్మరించుకుంటారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం బాలల దినోత్సవాన్ని నవంబర్ 20న అధికారికంగా జరుపుకుంటుంటారు. అయితే 1959కి ముందు అక్టోబర్ నెలలో బాలల దినోత్సవాన్ని జరుపుకునేవారు. ఐక్యరాజ్యసమితి నిర్ణయించిన ప్రకారం బాలల దినోత్సవాన్ని మొదటిసారిగా 1954లో ప్రపంచమంతటా నిర్వహిం చారు.1959 నవంబర్ 20న బాలల హక్కుల ప్రకటనను ఐరాస సర్వసభ్య సభ రూపొం దించిన సందర్భంగా బాలల దినోత్సవాన్ని ప్రపంచ మంతటా జరుపుకోవాలని నిర్ణయించారు. 1989లో పిల్లల హక్కులపై నవంబర్ 14న ఓ బిల్లును ఐరాస ఆమోదించింది.

ఈ బిల్లును ఆమోదిస్తూ 191 దేశాలు సంతకాలు పెట్టాయి కూడా. పిల్లలు తమ భావాలను, సమాచారాన్ని పంచుకోవడాన్ని, పరస్పర అవగాహనను పెంచుకోవడాన్ని ప్రోత్సహించేందుకు గాను ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ బాలల దినోత్సవానికి రూపకల్పన చేసింది.

ప్రపంచమంతటా పిల్లల సంక్షేమాన్ని ప్రోత్సహించేందుకోసం పలు చర్యలు చేపట్టడం ఈ దినోత్సవం లక్ష్యం.




నరేంద్ర మోడీ
ప్రధానమంత్రి

ప్రపంచ డయాబెటీస్ దినోత్సవం 14 నవంబరు 2017

సత్యమేవ జయతే
ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి
భారత ప్రభుత్వం

మీరు కల్గి ఉన్నారా?
- నిచ్చల జీవనశైలి
- డయాబెటీస్ గల కుటుంబ నేపథ్యం
- అధిక రక్తపోటు
- అధిక కొలెస్ట్రాల్
- అధిక శారీరక బరువు

మీ సమాధానం అవును అయితే, మీకు డయాబెటీస్ ప్రమాద పొంచి ఉంది.

డాక్టరును సంప్రదించండి



డయాబెటీస్‌ను నివారించండి
ఆల్కహాలుకు దూరంగా ఉండండి
పొగాకు వినియోగాన్ని విడిచిపెట్టండి
రోజు శారీరక వ్యాయామం చేయండి
సాధారణ శరీర బరువును కల్గి ఉండండి
ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరచుకోండి

స్వస్థ్య చేత్న అభియాన్ - ఆరోగ్య అవగాహన మరియు పరీక్షా శిబిరం
ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్, న్యూఢిల్లీ, 14 - 27 నవంబరు, 2017 వరకు

davp 17102/13/0065/1718

NATIONAL HEALTH MISSION राष्ट्रीय स्वास्थ्य मिशन
बेटी बचाओ बेटी पढ़ाओ
स्वच्छ भारत एक कदम स्वच्छता की ओर
@MoHFW_INDIA
YouTube mohfwindia
www.mohfw.nic.in
www.pmindia.gov.in
www.mygov.in


VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com